

శంకుస్థాపన చేసి మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మనం ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

www.manamepaper.com బుధవారం | 03 | నవంబర్ | 2026 | పేజీలు : 21

పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్లు...



-- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ , సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

-- దమ్మాయిగూడెం గ్రామంలో లబ్ధిదారులకు 2వ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేసిన మంత్రి

వివరాలు 2లో..

మురసు తుఫాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



: జిల్లా కలెక్టర్ అంకిత్

: కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు 08744-241950, 9392919743

– భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

– ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

వివరాలు 8లో..

దీపావళి వేడుకల్లో భద్రతకు ప్రాధాన్యత

టపాసుల దుకాణాల కేటాయింపులో పారదర్శకత పాటించాలి
ప్రతి దుకాణంలో విద్యుత్ వైరింగ్ తనిఖీ చేసి ధృవీకరించాలి



– భద్రతా ప్రమాణాల్లో రాజీ పడొద్దు
– దుకాణాల మధ్య కనీసం 3 మీటర్ల దూరం ఉండాలి
– అగ్నిమాపక వాహనాలు, 108 సేవలు, అత్యవసర వైద్య చికిత్సలు అందుబాటులో ఉంచాలి
– కలెక్టర్ దివాకర టిఎస్
– దీపావళి వేడుకలపై సమీక్ష

వివరాలు 2లో..



కరువు రాష్ట్రంగా ప్రకటించాలి

–తక్షణం కరువు నివారణ నిధులు విడుదల చేయాలి
–రుణాలను రీ షెడ్యూల్ చేయాలి
– ఉపాధి పనులు చేపట్టాలి
–నిత్యావసరాల బ్లాక్ మార్కెట్ను అరికట్టాలి
–సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని డిమాండ్
–కరువు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన సిపిఐ బృందం

వివరాలు 6లో..

పేద ప్రజల ఆత్మగౌరవానికి
ప్రతీక ఇందిరమ్మ ఇళ్లు

తిరుమలాయపాలెం, నవంబర్ 3 (మనం న్యూస్):
పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్ళని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామంలోని శ్రీ సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో 2 వ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తిరుమలాయపాలెం మండలంలో రెండో విడత క్రింద 187 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేదవారి ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ప్రతి నిరుపేద కుటుంబానికి ఉచితంగా రూ.5 లక్షల ఆర్థిక సాయంతో ఇల్లు కట్టించి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలో మొదటి విడతలో 810 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు దాదాపు 700 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. రెండో విడత కింద ఇళ్లను అందజేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకం అనేది విడతలతో ముగిసేది కాదని, అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లు అందేవరకు నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కుల, మత, రాజకీయ పార్టీల వ్యత్యాసాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామన్నారు. సొంతింటి కల నెరవేర్చుకోవాలనే నిరుపేద ఆడబిడ్డల చిరకాల కోరికను నెరవేర్చడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ ఇందిరమ్మ ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ, మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించామన్నారు. డ్వాక్రా మహిళలకు 73 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించామన్నారు. 74 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని, 14 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని మంత్రి అన్నారు. ఏది ఏమైనా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం ముందు, నేటి ప్రతిపక్ష నాయకుడు రెండు సంవత్సరాలలో ఈ దేశానికి ప్రధానమంత్రిగా రాబోతున్నారన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాత, ఇందిరమ్మ రాజ్యం ఈనాడు తెలంగాణ రాష్ట్రంలో ఎలా ఉందో, దేశవ్యాప్తంగా కూడా ఇందిరమ్మ రాజ్యం అలాగే ఉంటుందని, ఏవైతే ఈనాడు తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామో, కేంద్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా ఇదే తరహాలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుందని మంత్రి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, తిరుమలాయపాలెం మండలంలో మొదటి విడతలో భాగంగా దాదాపు 810 ఇళ్లు మంజూరు చేయబడ్డాయని, ఇందులో 600 ఇళ్లు పూర్తిగా పూర్తయి లబ్ధిదారులు గృహప్రవేశాలు కూడా పూర్తి చేసుకున్నారన్నారు. మరో 100 ఇళ్లు వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయని, వీటిలో స్లాబ్ వేసిన ఇళ్లు 60 వరకు ఉండగా, ఇటీవల కొత్తగా సాంక్షన్ రావడం వలన త్వరలో పనులు ప్రారంభించనున్న మరో 90 ఇళ్లు ఉన్నాయని తెలిపారు. రెండవ విడతలో భాగంగా అదనంగా మరో 185 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడం జరుగుతోందని కలెక్టర్ అన్నారు. ఈ పథకం కింద పూర్తిగా అర్హత ఉన్న నిజమైన పేదలను మాత్రమే పారదర్శకంగా ఎంపిక చేస్తున్నట్లు, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, వారు ఇళ్లు కట్టుకుంటున్న దశలను బట్టి ఫోటో తీస్తే చాలు, నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా పారదర్శకమైన విధానం అమలవుతోందని అన్నారు. దీనివల్ల ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో నమ్మకం, డిమాండ్ మరింత పెరిగిందని తెలిపారు. కొత్తగా మంజూరైన ఇళ్ల లబ్ధిదారులు కూడా త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. అనంతరం మంత్రి తిరుమలాయపాలెం మండలం ఏలువారిగూడెం గ్రామంలో ఎన్. నగేష్ - మంగమ్మ లు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం చేసి, లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు.
ఏలువారిగూడెం గ్రామంలో తెట్టెంపాడు-బీరోలు రోడ్డు నుండి ఏలువారిగూడెం వరకు రూ. 2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, బీరోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ. 48 లక్షలతో నిర్మిస్తున్న ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ శేఖర్ రెడ్డి, పిఆర్ ఎస్ఈ జి. వెంకట్ రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మండల ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్ లు వినోద, గుగులోతు తులసి నర్సింహ, గుమ్మడి దేవభిక్షం, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.



పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

– జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
– చాతకొండ 6వ బెటాలియన్లో మెన్ బ్యారెక్స్ నిర్మాణానికి భూమి పూజ

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 3 (మనంప్రతినిధి):
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చాతకొండలోని 6వ బెటాలియన్ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ పి.సి.వి. రమణ పుష్పగుచ్ఛం అందించి ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం బెటాలియన్ సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. సిబ్బంది సంక్షేమం, సౌకర్యాల కల్పనలో భాగంగా నూతనంగా నిర్మించనున్న మెన్ బ్యారెక్స్ నిర్మాణానికి ఎస్పీ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బందికి కల్పిస్తున్న వసతులు, చేపట్టనున్న నూతన నిర్మాణాల గురించి కమాండెంట్తో చర్చించారు. సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా పోలీసు శాఖ పనితీరును మరింత బలోపేతం చేయవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ పి.సి.వి. రమణ, అదనపు కమాండెంట్ ఎస్. శ్రీధర్ రాజా, అసిస్టెంట్ కమాండెంట్లు ఎ.వి. రమణయ్య, రామకృష్ణ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు జె. లెనిన్ బాబు, సి.హెచ్.వి. శ్రీనివాసరెడ్డి, జి.వి. రామారావు, బి. జానయ్య, బెటాలియన్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దీపావళి వేడుకల్లో భద్రతకు ప్రాధాన్యత

ఖమ్మం, నవంబర్ 03(మనం బ్యూరో)ః
దీపావళి వేడుకల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి దీపావళి పండుగ వేడుకలు, టపాసుల విక్రయ దుకాణాల ఏర్పాటు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన దీపావళి పండుగ ఉన్న నేపథ్యంలో టపాసుల విక్రయాలు, వినియోగం సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సాధారణంగా దీపావళి తర్వాత వారం రోజుల వరకు కూడా టపాసులు కాల్చే అవకాశం ఉన్నందున ఆ మేరకు అగ్నిమాపక, వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. టపాసుల దుకాణాల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా లాటరీ పద్ధతిలో కేటాయింపులు చేపట్టాలని అన్నారు. టపాసుల దుకాణాలను బహిరంగ ప్రదేశాల్లోనే ఏర్పాటు చేయాలని, తాత్కాలిక నిర్మాణాల ఏర్పాటులో మండే స్వభావం కలిగిన పదార్థాలను వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రతి దుకాణం మధ్య కనీసం 3 మీటర్ల దూరం ఉండేలా చర్యలు తీసుకోవాలని, దుకాణాల మధ్య తగినంత ఖాళీ స్థలం ఉండేలా చూడాలని, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా ప్రతి దుకాణంలోని విద్యుత్ వైరింగ్ను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి ధృవీకరించాలని ఆదేశించారు. అగ్నిమాపక యంత్రాలు, ఇతర అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచడంతో పాటు అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేందుకు టపాసుల విక్రయ కేంద్రాల వద్ద 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని, ప్రథమ, ద్వితీయ స్థాయి కాలిన గాయాలకు అవసరమైన మందులు, వైద్య చికిత్సలను సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. టపాసుల విక్రయ కేంద్రాల వద్ద త్రాగునీటి సదుపాయం, పరిసరాల పరిశుభ్రతకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. డివిజన్ స్థాయిలో సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారుల ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి, దీపావళి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. వ్యాపార లాభాల కంటే ప్రజల భద్రతే ముఖ్యమని, ఆదాయం కోసం భద్రతా ప్రమాణాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఖమ్మం నగరంలో రెండు ప్రాంతాల్లో టపాసుల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, నగరంలో మరో అనువైన బహిరంగ ప్రదేశం ఉంటే అధికారులు గుర్తించి తెలియజేయాలని, అక్కడ కూడా దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు పర్యావరణానికి హాని కలిగించని గ్రీన్ క్రాకర్స్ మాత్రమే వినియోగించాలని, కాలుష్యాన్ని పెంచే టపాసులకు దూరంగా ఉండాలని సూచించారు. దీపావళి వేడుకల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పర్యావరణ పరిరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలీస్ శాఖ ఏసీపీ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు 224 దరఖాస్తులు అందాయని, అందుబాటులో ఉన్న దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్, డీపీఓ వినోద్ కుమార్, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారులు, టపాసుల దుకాణాల యజమానులు, విక్రయదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సాధికారత కోసం కొట్లాడి నిధులు తెస్తా

- నారీ నైపుణ్య స్కిల్ సెంటర్ ప్రారంభోత్సవంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు





ఖమ్మం, నవంబర్ 3 (మనం న్యూస్): ఖమ్మం మహిళల సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కొట్లాడి మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యు లు వద్దిరాజు రవిచంద్ర హామి ఇచ్చారు. పేదరికంలో ఉన్న, ఒంటరి మహిళలు స్వయంకృషి, ఆత్మగౌరవంతో జీవించేం దుకు ఉచిత నైపుణ్య శిక్షణా కేంద్రాలు ఎంతగానో దోహదపడుతా యన్నారు. మంగళవారం ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపాన 'ది గాడ్ థ్రైర్సా మహిళా మండలి' ఆధ్వర్యంలో 'కే.సీ.పుల్లయ్య ఫౌండేషన్',' కెపిసి ప్రాజెక్టు లిమిటేడ్ కంపెనీ' సౌజన్యంతో ఏర్పాటు చేసిన 'నారీ నైపుణ్య శిక్షణా కేంద్రం' (ఉచిత మహిళా కుట్టు శిక్షణా తరగతుల కేంద్రం) ప్రారం భోత్సవానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి జీ వి మాల్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గుర్రం ఉమా మహేశ్వరరావుతో కలిసి శిక్షణా తరగతు లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర మాట్లా డుతూ, మహిళల పేదరికాన్ని పారదోలేందుకు, ఆర్థిక స్వావలంబనకు, ఆత్మగౌరవంతో జీవించేం దుకు కే.సీ. పుల్లయ్య ఫౌండేషన్, గాడ్ థ్రెర్సా మహిళా మండలి, కెపిసి కస్ట్రక్షన్స్ చేస్తున్న కృషి అభినందనీ యమన్నారు. హైదరాబాద్, విజయవాడల లోని భారత రత్న డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహాలను నెలకొల్పడంలో కె సి పుల్లయ్య ఫౌండేషన్ ప్రధాన భూమిక పోషించిం దన్నారు. రాజకీయాలకు అతీతంగా మాన వీయ దృక్పథంతో ఇటువంటి శిక్షణా కార్యక్ర మాలు మరిన్ని ముందుకు సాగాలని ఎంపీ రవిచంద్ర అభిలషించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు పుట్టినరోజు సందర్భంగా జూలై 24వతేదీన "స్మైల్ ఏ గిఫ్ట్"పేరుతో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వరంగల్ లో 2వేల మంది మహిళలకు కుట్టుమిషన్లు బహుకరించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన గాయత్రి గ్రానైట్స్ కంపెనీ నుంచి, జీ మాల్ ఉమా మహేశ్వర రావు సహాయంతో మరికొందరు మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తామని ఈ సందర్భంగా ఆయన హామి ఇచ్చారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కేంద్రం విస్తృతికి కృషి చేస్తా నని రవిచంద్ర చెప్పారు. కొద్ది పెట్టుబడితో చిన్నగా మొదలుపెట్టి కోట్ల రూపాయల టర్నోవర్‌కు చేరుకున్న వ్యాపారులను సూరత్, బెంగళూరు తదితర చోట్ల తాను చూశానన్నారు.క్రమశిక్షణతో కష్టపడి పని చేయడం, వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవడం ద్వారా జీవితంలో ఉన్నతంగా ఎదగొచ్చని, అటువంటి వారికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఎంపీ రవిచంద్ర వివరించారు. జి వి మాల్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ఎం డి గుర్రం ఉమామహేశ్వర్‌రావు మాట్లాడ్తూ ఎవ్వరిమీద ఆధారపడకుండా స్వతహాగా స్వతంతంగా జీవించేందుకు ఈనాటి మహి ళలు ముందుకు రావడం అభినందనీయ మన్నారు. కెసి పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఎన్నో స్వచ్ఛంధ సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారని చెబుతూ ఈ సందర్భంగా ఫౌండేషన్‌ను అభినందిం చారు. నారీ నైపుణ్య శిక్షణ కేంద్రంకు తన వంతుగా అన్ని విధాలుగా సహకరిస్తానని, వస్త్ర రంగంలో ఉన్న తాను అవసరం అయి తే ఒక రోజు తాను కూడా మహిళలకు ప్ర స్తుత ప్యాషన్, వస్తరంగం, డిజైన్లు తదితర అంశాలపై శిక్షణ ఇస్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో కె సి ఫౌండేషన్ సి ఇ వోచల్లా సుధారాణి, కెసి ఫౌండేషన్ హెల్త్ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ స్వప్న, ఖమ్మం ప్రాజెక్టు మేనేజర్ సుందర్, ది గాడ్ థ్రెర్సా మహిళా మండలి అధ్యక్షురాలు ఆవుల నాగ రాణి,ప్రధాన కార్యదర్శి ఉమా, కోశాధికారి ఖతీజా బేగం, సంయుక్త కార్యదర్శి సురబీ అనిత, రాజ్యంగ పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు, పాపులర్ ఛానల్ ఎం డి సాధిక్ అలీ, సీనియర్ జర్నలిస్ట్ వసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను ఘనంగా సత్కరించారు.





ఎస్‌బీఐటీలో "ఆరంభ్" స్వాగత వేడుకలు

ఖమ్మం, నవంబర్ 3 (మనం న్యూస్) : తమ కళాశాలలో నూత నంగా ప్రవేశం పొందిన బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులను ఆహ్వానిస్తూ "ఆరంభ్" ఫ్రెషర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించామని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో కళాశాల దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో క్రమశిక్షణ, పట్టుదల, నైపుణ్యాభివృద్ధి మరియు సృజనాత్మక ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు కేవలం అకడమిక్ విద్యకే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మరియు ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డా॥ ధాత్రి తెలిపారు. కళాశాలలో అందుబాటులో ఉన్న వివిధ శిక్షణా కార్యక్రమాలు, సాంకేతిక వేదికలు మరియు ప్లేస్‌మెంట్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల వైస్ చైర్మన్ కే.శ్రీ చైతన్య సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రాజ్ కుమార్ మాట్లాడుతూ ర్యాగింగ్ రహిత కళాశాల గా తమకు ఉన్న పేరును నిలబెడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు తాము నిరంతరం శ్రమిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు మరియు వినోద కార్యక్రమాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్ విద్యార్థులు నూతన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికి, కళాశాల వాతావరణానికి అలవాటు పడేందుకు సహకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్, గంధం శ్రీనివాస్ రావు, ఏ. వి. వి.శివ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





మనం
ఖమ్మం
ఖమ్మం కార్పొరేషన్- ఖమ్మం అర్బన్ - రఘునాధపాలెం

టీఆర్ఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వనం నాగేంద్ర కుమార్

నగర అధ్యక్షుడిగా కర్లపూడి రఫీ నియామకం



ఖమ్మం : తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఖమ్మం జిల్లా కమిటీలో నూతన నియామకాలు చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వనం నాగేంద్ర కుమార్, ఖమ్మం నగర అధ్యక్షుడిగా కర్లపూడి రఫీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వనం నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ తెలంగాణ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవితక్కతో గత 13 ఏళ్లుగా తనకు అనుబంధం ఉందని తెలిపారు. తన సేవలను గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన కవితక్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. నగర అధ్యక్షుడు కర్లపూడి రఫీ మాట్లాడుతూ కవితక్క అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ ఖమ్మం నగరంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి సుందర్, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ హుస్సేన్, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కమిషనర్



ఖమ్మం, నవంబర్ 3(మనం న్యూస్) : వెలుగుమట్లలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులతో పాటు, ఆయా కాలనీల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ ఇంజనీరింగ్, ఇందిరమ్మ ఇళ్ల విభాగాల అధికారులతో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, వివిధ దశల్లో ఉన్న ఇళ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా నిర్మాణ పనులు ప్రారంభించని ఇళ్లకు గల కారణాలను తెలుసుకుని, లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఆయా కాలనీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా చేపడుతున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అదేవిధంగా కాలనీల చుట్టూ ప్రహరీ నిర్మాణం, తాగునీటి సరఫరా కోసం చేపడుతున్న పైప్‌లైన్ . పనుల నాణ్యతను పరిశీలిస్తూ, నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కాలనీల్లో నివసించే ప్రజలకు రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందేలా సమగ్ర ప్రణాళికతో పనులు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. అన్ని పనులను సమన్వయంతో వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి 5న స్పాట్ కౌన్సిలింగ్

ఖమ్మం, నవంబర్ 3 (మనం న్యూస్): గాంధీ చౌక్ లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 5వ తేదీన స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బానోత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ తో నేరుగా కళాశాలకు హాజరుకావాలని సూచించారు. ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లీష్, ఎంకామ్ సబ్జెక్టులలో ఖాళీలు ఉండగా సంబంధిత డిగ్రీ సబ్జెక్టులో 50% మార్కులు ఉంటే పీజీ సెట్ రాసినవారు, రాయనివారు కూడా హాజరు కావచ్చు అని తెలిపారు పూర్తి వివరాలకు 8247253606 నెంబర్ లో సంప్రదించాలని తెలిపారు..

మనం
పాలేరు
కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

వరంగల్ - నల్గొండ - ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదులో అర్హులందరూ భాగస్వాములు కావాలి

మహేందర్ నాయక్, కుసుమంచి మండల ప్రధాన కార్యదర్శి (బీజేపీ)



కూసుమంచి, నవంబర్ 3 (మనం న్యూస్) : వరంగల్ – నల్గొండ – ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఎన్నికల నేపథ్యంలో, అర్హులైన పట్టభద్రులందరూ పెద్దఎత్తున ముందుకు వచ్చి ఓటరు నమోదు (ఎన్రోల్మెంట్) చేసుకోవాలని కుసుమంచి మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి మహేందర్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత, నిరుద్యోగులు మరియు పట్టభద్రుల సమస్యలపై నిజమైన పోరాటం చేసే నాయకత్వాన్ని ఎన్నుకోవడంలో ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత కీలకమైనవని తెలిపారు. గతంలో ఓటు ఉన్నప్పటికీ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలని గుర్తుచేశారు. కుసుమంచి మండలంలోని ప్రతి గ్రామంలో అర్హులైన గ్రాడ్యుయేట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బీజేపీ శ్రేణులు కూడా ఓటరు నమోదు కార్యక్రమంలో క్రియాశీలకంగా పాల్గొని అర్హులకు సహాయం చేయాలని కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత యూనిఫామ్‌ల పంపిణీ



కూసుమంచి నవంబర్ 3 (మనం న్యూస్) : ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, ప్రోత్సాహక కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఎంఈఓ రాయల రాయల వీరస్వామి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు, ప్రభుత్వ జూనియర్ కళాశాల కూసుమంచిలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, షూస్, సాక్సులు, ఐడీ కార్డులు, బెల్టులు, యూనిఫామ్‌లను కళాశాల ప్రిన్సిపాల్ బి. వీరభద్రరావు, మండల విద్యాశాఖాధికారి (ఎం ఈ ఓ) రావెళ్ల వీరస్వామి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎం ఈ ఓ రావెళ్ల వీరస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రిన్సిపాల్ బి. వీరభద్రరావు మాట్లాడుతూ, విద్యార్థుల చదువుకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే సదుద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహకాలు ఎంతో విలువైనవని తెలిపారు. ఉచిత విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి, యూనిఫామ్‌లను అందించడం ద్వారా ప్రభుత్వం వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ చేసే ఓట్ల తొలగింపు ఆరోపణ సమంజసం కాదు



కూసుమంచి, నవంబర్ 3 (మనం న్యూస్) : ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని బీజేపీ నాయకులు మంద చంద్రశేఖర్ గౌడ్ కాంగ్రెస్ నాయకులను కోరారు, ఖమ్మం జిల్లా బీజేపీఎం ఉపాధ్యక్షుడు మంద చంద్రశేఖర్ గౌడ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు, ఆ ప్రకటనలో కారణం లేకుండా అర్హుల ఓట్లు తొలగించినట్లు నిరూపిస్తే తమ పార్టీ ఎలాంటి చట్టపరమైన శిక్ష కైనా సిద్ధమని, మీ పార్టీ కూడా సిద్ధంగా ఉంటుందా అని ప్రశ్నించారు, అనవసరమైన, నిరాధారమైన ఆరోపణలు చేయడం సరైనది కాదని హితవు పలికారు, వాస్తవాలు తెలుసుకొని ప్రజలకు నిజాలు తెలియజేయాలని కోరారు.

పేదల వైద్యం, విద్యకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దపీట



- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచిలో 100 పడకల ఆసుపత్రి పనులను తనిఖీ చేసిన మంత్రి

కూసుమంచి, నవంబర్ 3 (మనం న్యూస్) : సంక్షేమ కార్యక్రమాలతో పాటు వైద్య, విద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి, పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం గంగబండ తాండా వద్ద రూ. 45.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒకటో బ్లాక్ స్లాబ్ సెంట్రింగ్, స్టీల్ ఫ్యాబ్రికేషన్ పనులు జరుపుతున్నట్లు, రెండో బ్లాక్ స్లాబ్ వేసినట్లు అధికారులు తెలిపారు. రెండో బ్లాక్ కాలం కాంక్రీట్ పనులు జరుగుతున్నట్లు మంత్రికి వివరించారు. నాణ్యతతో, నిర్దీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదవాళ్ల పిల్లలకు కూడా ఉన్నతమైన విద్యను అందించడంతో పాటు, పేదవాడికి రోగమొస్తే నయం చేసుకునే ఆర్థిక స్థోమత లేని పరిస్థితుల్లో రోడ్డున పడకుండా ఉండేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో అవసరమైన ప్రతిచోటా 100 పడకల ఆసుపత్రులతో పాటు మౌలిక వసతులను ఏర్పాటు చేస్తూ, ఆసుపత్రుల రిక్వైర్మెంట్ బట్టి డాక్టర్లను కూడా కేటాయిస్తున్నామని తెలిపారు. గతంలో పేదవాడికి జబ్బు చేస్తే "అయ్యో.. ఇంత పెద్ద జబ్బు చేసింది, వైద్యం చేయించుకోవడానికి నా దగ్గర డబ్బు ఏముంది, నాకు చావే గతి" అనే రోజులు ఉండేవని, కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారికి పూర్తి భద్రత, భరోసా కల్పిస్తున్నామని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం తీసుకునే వారికి కూడా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ధనికులకు ఏ రకమైన వసతులు అందుబాటులో ఉన్నాయో, అదే విధంగా పేదవాళ్లకు కూడా వైద్య, విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో సైతం వైద్య రంగానికి కావలసిన పూర్తి మౌలిక వసతులను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. మంత్రి పర్యటన సందర్భంగా డీసీహెచ్ఎస్ డా. రాజశేఖర్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, వైద్య శాఖ ఈఈ టీ. ఉమామహేశ్వర రావు, కూసుమంచి తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





ఉద్యోగుల నిస్వార్థ సేవలే సమాజానికి ఆదర్శం



- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- విద్యుత్ శాఖ లైన్ ఇన్స్పెక్టర్ గడ్డికొప్పుల రాములు ఉద్యోగ విరమణ సభలో పాల్గొన్న మంత్రి

తిరుమలాయపాలెం, నవంబర్ 3 (మనం న్యూస్) : ఉద్యోగుల నిస్వార్థ సేవలే సమాజానికి ఆదర్శమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం విద్యుత్ శాఖలో లైన్ ఇన్స్పెక్టర్‌గా సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన గడ్డికొప్పుల రాములు సన్మాన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాములు, ఆయన కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి అభినందించారు.మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగంలో చేరినప్పుడే విరమణ తేదీ ఖరారవుతుందని, అయితే ఉద్యోగ కాలంలో ప్రజలకు, రైతులకు అందించిన సేవలే ఉద్యోగ విరమణ తర్వాత కూడా వారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. రాములు అందించిన సేవలు, చేసిన మంచి పనుల కారణంగానే వర్షం పడుతున్నప్పటికీ వందలాది మంది రైతులు, ప్రజలు ఆత్మీయంగా తరలివచ్చారని పేర్కొన్నారు. ఉద్యోగి సేవా కాలం ముగిసిన తర్వాత కూడా ప్రజలు గుర్తుంచుకోవడమే అసలైన విజయమన్నారు.ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని స్వలాభం కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం వినియోగించినప్పుడే జన్మ సార్థకమవుతుందని తెలిపారు. రాములు ఉద్యోగానికి మాత్రమే విరమణ ఇచ్చారని, సమాజ సేవకు కాదని, తన అనుభవంతో ప్రజలకు సేవలు కొనసాగిస్తూ ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి, పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొప్పుల అశోక్, ఎర్రగడ్డ సర్పంచ్ నల్లమల్ల కీర్తి, తాసిల్దార్ లూథర్ విన్సన్, ఎంపీడీవో ఎస్ కే సిలార్ సాహెబ్, విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డి ఈ. చింతమల్ల నాగేశ్వరావు, ఏడిఏ కోకియా నాయక్, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



తెల్లారుపల్లి వద్ద ఎన్నెస్పీ కాల్వపై బ్రిడ్జి నిర్మిస్తాం



- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- రూ.5 కోట్లతో చేపట్టేందుకు ఆమోదించినట్లు వెల్లడి
- తెల్లారుపల్లి 14,15,16వ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 3(మనం న్యూస్) : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్లారుపల్లి వద్ద స్థానిక రైతులు గ్రామానికి అవతల వైపు ఉన్న తమ వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు, గ్రామస్తుల సౌకర్యార్థం రూ.5 కోట్ల నిధులతో ఎన్నెస్పి కాలువపై నూతన బ్రిడ్జిని నిర్మిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. మంగళవారం తెల్లారుపల్లిలోని 14,15,16వ వార్డుల్లో రూ. 3.20 కోట్లతో నిర్మించే సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం కలెక్టర్ దివాకర. టిఎస్, ఏదులాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ లతో కలిసి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం వచ్చిన ఈ 33 నెలల్లో తెల్లారుపల్లి అభివృద్ధికి.. రూ. 16.06 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రూ.5.25 కోట్లతో 105 ఇందిరమ్మ ఇళ్లను పేదలకు ఇచ్చామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని, ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.6వేల చొప్పున ఏడాదికి రూ. 12 వేల రైతు భరోసా అందిస్తున్నామని చెప్పారు. గత పాలకులు వరి పంట వేస్తే ఊరే అని రైతులను బెదిరించాలని, తామొచ్చాక సన్న రకం దాన్యం రైతులకు బోనస్ ఇచ్చి ప్రోత్సహించామని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు రూ. 40వేల కోట్లు

మన రాష్ట్రంలో రెండు విడతల్లో ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించామని, హైదరాబాద్ నగరంలో అర్హులైన పేదలకు లక్ష ఇళ్లు ఇస్తున్నామని..మొత్తం రూ. 40,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

అర్హులైన రైతులందరికీ 'భూధార్' కార్డులిస్తాం

రాష్ట్రంలో సుమారు 125 సంవత్సరాల క్రితం భూముల సర్వే జరిగిందని, మళ్లీ ఇప్పుడు తమ ప్రభుత్వం సర్వే చేపించి, రైతులకు పూర్తి భరోసా కల్పించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి అన్నారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ ఈ సర్వేను వెంటనే చేపట్టాలని ఇప్పటికే కలెక్టర్ కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ బాబు, ఆర్డీవో శ్రీనివాస్, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



28వ వార్డులో సీపీఐ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు



- మాజీ వార్డు మెంబర్ నారపొంగు యాకుబ్, ఆయన సోదరుడు మల్సూర్ కాంగ్రెస్‌లో చేరిక
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న నేతలు

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 3(మనం న్యూస్) : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డు 28వ వార్డులో సీపీఐకి చెందిన మాజీ వార్డు మెంబర్ నారపొంగు యాకుబ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 28వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో యాకుబ్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు సోదరుడు నారపొంగు మల్సూర్ సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో సీపీఐ తరఫున వార్డు మెంబర్‌గా పనిచేసిన యాకుబ్ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ 28వ వార్డులో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం తన కుటుంబ సభ్యులతో కలిసి పనిచేశారు. దశాబ్దాలుగా సీపీఐతో అనుబంధం కొనసాగించిన నారపొంగు కుటుంబం తాజాగా కాంగ్రెస్‌లో చేరడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

అభివృద్ధిలో భాగస్వాములమవుతాం: యాకుబ్

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో పనిచేయాలనే నిర్ణయంతోనే కాంగ్రెస్‌లో చేరినట్లు నారపొంగు యాకుబ్ తెలిపారు. తమ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్లు, రహదారులు, డ్రైనేజీ పనులతో పాటు అర్హులకు పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు అందుతున్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారనే నమ్మకంతో కాంగ్రెస్‌లో చేరినట్లు వెల్లడించారు.

గుండెపోటుతో సీపీఎం సీనియర్ నేత వేగినాటి వెంకట్రావు మృతి

- పార్టీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు..
- పలువురు నేతల ఘన నివాళి

తిరుమలాయపాలెం నవంబర్ 3 (మనం న్యూస్) : తిరుమలాయపాలెం మండలంలోని వెదుళ్ల చెరువు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు వేగినాటి వెంకట్రావు మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంకట్రావు మృతదేహాన్ని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ బండి పద్మ షేక్ బషీరుద్దీన్ తదితర నాయకులు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వేగినాటి వెంకట్రావు పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం సాగించారని కొనియాడారు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఆయన మరణం సీపీఎం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





మనం పాలేరు
కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం



విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఏ. అరుణాదేవి



ముదిగొండ, నవంబర్ 3 (మనం న్యూస్) : ముదిగొండ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు పొగాకు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఏ. అరుణాదేవి మాట్లాడుతూ యుక్తవయసులో విద్యార్థులు చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొగాకు, మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో చదువుపై దృష్టి సారించి, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించాలని ఆకాంక్షించారు.ఇతర వక్తలు సైతం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. చెడు అలవాట్లకు బానిసలైతే భవిష్యత్తు దెబ్బతింటుందని, విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవరచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సోహైల్, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి. శ్రీనివాసరావు, నషా ముక్త్ భారత్ కోఆర్డినేటర్ టి. ఉష, ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జె. నాగేంద్ర ప్రసాద్, సీహెచ్ఓ మధుసూదన్, ఏఎన్ఎం వసంత, కళాశాల అధ్యాపకులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జసిద్దినేని కోటయ్య పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శం

- సీపీఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్
- గూడూరుపాడులో ఘనంగా 20వ వర్ధంతి వేడుకలు

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 3(మనం న్యూస్) : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తూ, జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి కొనసాగిన సిద్దినేని కోటయ్య పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శమని సీపీఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ అన్నారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం గూడూరుపాడు గ్రామంలో సిద్దినేని కోటయ్య 20వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పుచ్చకాయల సుధాకర్ మాట్లాడుతూ.. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం సిద్దినేని కోటయ్య చేసిన సేవలు, సాగించిన పోరాటాలు చిరస్మరణీయమని కొనియాడారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ఎర్రజెండా అండతో ప్రజల పక్షాన నిలిచిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన అందించిన సేవలను నేటి తరం యువత గుర్తించి, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్దినేని కర్ణకుమార్, మాజీ సర్పంచ్ బండి ఉపేందర్, స్థానిక నాయకులు సిద్దినేని మంగయ్య, బోస్, బోలుకొండ వెంకటరమణ, పోటు నాగరాజు, బండి మహేష్, ఎస్. శేఖర్, డి. హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



మనం
జనం కోసం లక్షర యజ్ఞం..



వైరా

వైరా - కారేపల్లి - కొణిజర్ల - ఏన్కూరు - జూలూరుపాడు

పేద, మధ్యతరగతి కుటుంబాలకు సంక్షేమ పథకాలు

– వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ


వైరా, నవంబర్ 3 (మనం న్యూస్): పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను ఆమె, వార్డు కౌన్సిలర్ వేముల శ్రావణి రత్నాకర్ తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాపా చంద్రకళ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువ చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.రెవెన్యూ శాఖ జి పి ఓ షేక్ మస్తాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలెం భాస్కర్, వేముల రత్నాకర్, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



అమరుల స్ఫూర్తితోనే ప్రజా ఉద్యమాలు

–న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్

కారేపల్లి,నవంబర్03(మనం న్యూస్): అమరుల స్ఫూర్తితోనే ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తూ, సమాజంలో పేదలు వివిధ రూపాలలో దోపిడికి గురవుతున్నారని, దోపిడి ప్రతిఘటనతోనే అంతం అవుతుందని సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్ అన్నారు.మంగళవారం కారేపల్లి మండలం శాంతినగర్ పోట్ల రామనరసయ్య 50వ వర్ధంతి సభను నిర్వహించారు. భూక్య శివ నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో ఎన్టీ నేత అశోక్ మాట్లాడుతూ ఓపెన్ కాస్ట్ లతో శాంతినగర్, టేకులగూడెం తదితర గిరిజన గ్రామాల సాగు చేస్తున్న భూములు వందలాది ఎకరాలు కోల్పోయారన్నారు. ఓపెన్ కాస్ట్ లతో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోక పోగా మట్టిదిబ్బలు మిగిల్చారన్నారు. ఓసీలతో భూములో పోయి గిరిజనులకు ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయన్నారు. విదేశీ, స్వదేశ్ కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకుపిలుపునిచ్చారు. భూమి కోసం, భుక్తి కోసం, దేశ విముక్తి కోసం సాగిన విప్లవోద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రజలంతా సంఘటితమై ఉద్యమించాలనికోరారు.ఈ కార్యక్రమంలో ఎన్డీ నాయకులు చంద్రయ్య,బాలకృష్ణ,వెంకన్న, హరిబాబు,రాంబాబు,రాధా, గురువమ్మ,రాజు,బచ్చల కృష్ణ, రవి,మేస్త్రి వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తెదేపా విజయం పట్ల హర్షం

కామేపల్లి , నవంబర్ 3 (మనం న్యూస్): ఆంధ్ర ప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో తెలుగు దేశం పార్టీ సారధ్యంలోని కూటమి విజయం సాధించడం పట్ల తెలుగు దేశం లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, తెదేపా మండల అధ్యక్షుడు పుచ్చకాయల సత్యనారాయణ హర్షశీ వ్యక్తం చేశారు.జాస్తిపల్లిలో స్థానిక విలేకరులతో మంగళవారం మాట్లాడారు. రెండున్నర సంవత్సరాల కూటమి పాలన పట్ల ప్రజలు ఇచ్చిన రెపరెండం గా ఈ పలితాలు ఉన్నాయన్నారు. చంద్రబాబు పాలన స్వర్ణయుగంగా ప్రజలు భావించడం వల్లనే, ఈ తీర్పు వచ్చిందన్నారు. ఇదే విధముగా రాబోయే ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబు నాయుడు గారి మీద నమ్మకం తో తెలుగు దేశం పార్టీని ఆదరించే పరిస్థితి ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఏవిధముగా తెలుగు దేశం ప్రభుత్వ పరిపాలన కొనసాగిందో, ఇప్పుడు పక్క రాష్ట్రంలో జరుగుతున్న పాలన చూసి నెమరు వేసుకుంటున్న తెలంగాణ ప్రజలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీని గెలిపించేందుకు సమాయత్తం అయ్యే పరిస్థితి ఉందన్నారు. సమావేశంలో రాయల కోటేశ్వరరావు, నామ ఉపేందర్, పరిటాల నాగార్జున, చావ రఘు పాల్గొన్నారు.



రాష్ట్రవ్యాప్తంగా కరువు ప్రకటించాలి

– రైతులకు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలి: ఎమ్మెల్యే కూనంనేని

కొణిజర్ల,నవంబర్ 03 (మనం న్యూస్): దేశవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని సైతం కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ జిల్లాల కరువు పరిశీలన పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన కొణిజర్ల, తనికెళ్ల ప్రాంతాల్లో పర్యటించి సాగునీరు లేక బీడుభూములుగా మారిన పొలాలను పరిశీలించారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ లెక్కచేయకుండా రైతుల పొలాలను సందర్శించి పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం తనికెళ్లలోని డాక్టర్ గరికపాటి రాజారావు కళామందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందన్నారు. భవిష్యత్తులో తాగునీరు, పశువుల మేతకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో వరి పంటలు ఎండిపోయి చేతికొచ్చిన పంట దెబ్బతిన్నట్లు పరిశీలనలో గుర్తించామని తెలిపారు. పత్తి పంట ఎకరాకు కేవలం మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే పరిస్థితి నెలకొందన్నారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే కరువు బృందాలను పంపించి గ్రామాలవారీగా పంట నష్టం, వరి, ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం, పశుగ్రాసం లభ్యతపై సమగ్ర అంచనా వేయించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు పంట రుణాలను ఒకేసారి మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రూపాయలకు పైగా రుణాలు తీసుకున్న రైతులు అదనపు మొత్తాన్ని చెల్లిస్తే రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, ఆ మొత్తాన్ని చెల్లించిన రైతులకు వెంటనే రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. పంటల బీమా వంటి సౌకర్యాలు అందక రైతులు నష్టపోతున్నారని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి రైతుకు న్యాయం చేయాలని సూచించారు.ఉపాధి హామీ పథకం పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదని, వెంటనే పనులు కల్పించడంతో పాటు అదనపు పనిదినాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం, కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు భరించేవని, ప్రస్తుతం రాష్ట్రం 40 శాతం, కేంద్రం 60 శాతం భరించాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిధుల వాటా విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు.ఈ పర్యటనలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, మిడికంటి వెంకటరెడ్డి, తోట రామాంజనేయులు, కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్ణ రమేష్, తనికెళ్ల సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వర్లు, గొడ్డుగొర్ల శ్రీను, లేడిబోయిన గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.





పట్టభద్రుల ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

– బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి పిలుపు

వైరా, నవంబర్ 3 (మనం న్యూస్): ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వైరాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఐదు లక్షల మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకున్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా జాబ్ క్యాలెండర్ అమలు కాలేదని, మెగా డీఎస్సీ హామీ నెరవేరలేదని విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన గూగుల్ ఏఐ క్యాంపస్ పక్క రాష్ట్రానికి తరలిపోయిందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో కేటీఆర్ ఐటీ శాఖ మంత్రిగా అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చారని పేర్కొన్నారు.కేసీఆర్ పదేళ్ల పాలనలో విద్య, ఐటీ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చామని, రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి పాఠశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు, విద్యార్థుల సమస్యలు పెరుగుతున్నాయని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీ అమలులో జాప్యం జరుగుతోందని విమర్శించారు. సర్వర్ సమస్యల కారణంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని ఎన్నికల అధికారులను కోరినట్లు తెలిపారు.ఓటరు నమోదు గడువు మరో రెండు రోజులు మాత్రమే ఉన్నందున అర్హులైన పట్టభద్రులు వెంటనే తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని రాకేష్ రెడ్డి కోరారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, లకావత్ గిరిబాబు, కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, బాణాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ దొంతేబోయిన వెంకటేశ్వర్లు, సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, మద్దెల రవి, బాతోత్ రామ్మూర్తి, వాసిరెడ్డి రవి, మిట్టపల్లి కిరణ్ కుమార్, ఏదునూరి శ్రీను, సింగవరపు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

కారేపల్లి, నవంబర్03(మనం న్యూస్): ఖమ్మం,నల్గొండ,వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు కోసం సింగరేణి మండలానికి చెందిన అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమల రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు సహాయ కేంద్రాల్లో అవసరమైన ధ్రువపత్రాలు అందజేస్తే, నిర్వాహకులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు సమర్పించి అనంతరం రసీదును అందజేస్తారని తెలిపారు.మండలంలోని అన్ని గ్రామాల అర్హులైన పట్టభద్రులు నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైన వజ్రాయుధం అని అన్నారు.



జీతం కావాలంటే రాజీనామా చేయాలంటూ సర్పంచ్ భర్త బెదిరింపులు

– కార్మికుడి జీతం చెక్కుపై సంతకం పెట్టని సర్పంచ్
– జీతం ఇస్తాం కానీ ఉద్యోగం వదిలి వెళ్లిపో అంటూ ఒత్తిడి
– తెర వెనుక సర్పంచ్ భర్త ఆగడాలు

మధిర,నవంబర్3(మనం న్యూస్):మధిర మండలం జాలముడి గ్రామపంచాయతీలో దారుణం వెలుగు చూసింది. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న దళిత కార్మికుడిని సర్పంచ్ తో పాటు సర్పంచ్ భర్త కూడా కులం పేరుతో దూషిస్తూ, జీతం కోసం వేధిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి.

అసలేం జరుగుతోంది?

జాలముడి గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు ప్రతిరోజూ పారిశుధ్య పనులతో పాటు పంచాయతీ అప్పగించిన పనులన్నీ చేస్తున్నారు.అయినా గత 11 నెలలుగా అతనికి జీతం అందడం లేదు.జీతం చెక్కుపై సర్పంచ్ సంతకం చేయడం లేదని, అనలు పంచాయతీ వ్యవహారాలన్నీ సర్పంచ్ భర్తే చూస్తున్నారని, ఆయనే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తు న్నారు. చెక్కుపై సంతకం చేయమని అడిగితే సర్పంచ్ , ఆమె భర్త కలిసి 'నువ్వు దళితుడివి, నీ ఇష్టం వచ్చింది చేసుకో' అంటూ కులం పేరుతో దూషిస్తున్నట్లు కార్మికుల ఆరోపిస్తున్నాడు. నీ జీతం నీకు ఇస్తాం కానీ నువ్వు ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపో అంటూ ఇద్దరూ కలిసి బెదిరింపులకు పాల్పడుతున్నారు.సర్పంచ్ భర్త పంచాయతీకి వచ్చి నన్ను బెదిరిస్తున్నారు" అని బాధిత కార్మికుడు ఆవేదన వ్యక్తం చేశారు.

సర్పంచ్ భర్త పెత్తనం ఏమిటి?



ఎన్నికల్లో గెలిచింది భార్య అయితే, పాలన సాగిస్తున్నది భర్త అనే విమర్శలు జాలముడిలో బలంగా వినిపిస్తున్నాయి. పంచాయతీ చెక్కుల నుంచి, పనుల కేటాయింపు వరకు అన్నీ సర్పంచ్ భర్తే నిర్ణయిస్తున్నారని, ప్రశ్నించే వారిని బెదిరిస్తున్నారని వార్డు సభ్యులు కూడా చెబుతున్నారు.

అధికారులు స్పందించాలి:

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్పంచ్ భర్తకు పంచాయతీ వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అధికారం లేదు. అయినా భర్త అక్రమంగా జోక్యం చేసుకుంటూ దళిత కార్మికుడిని వేధించడం పట్ల దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.ఈ విషయంపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి వెంటనే స్పందించి, సర్పంచ్ తో పాటు అక్రమంగా పెత్తనం చెలాయిస్తున్న సర్పంచ్ భర్తపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత కార్మికుడికి న్యాయం చేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆశా వర్కర్స్ సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేస్తాం

– మద్దాల ప్రభాకరరావు
సీఐటీయూ జిల్లా నాయకులు

ఎర్రుపాలెం,అక్టోబర్ 4 (మనం న్యూస్): ఆశా వర్కర్లల సమస్యలు పరిష్కరించాలని రూ.18వేలు ఫిక్స్డ్ వేతనం పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం ఉద్యోగ భద్రత కల్పించి ఇతర సమస్యలు పరిష్కరించాలని లేని ఎడల 2026 డిసెంబర్ 15 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నామని సీఐటీయూ కార్మిక సంఘం జిల్లా నాయకులు మద్దాల ప్రభాకర్ తెలియజేస్తూ సమ్మె నోటీస్ బనిగండ్లపాడు పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్ సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా మద్దాల ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అశా వర్కర్స్ 28 వేల మంది గత 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని వీరంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలు ప్రజలకు ఆశాలు సేవలందిస్తున్నారు గర్భిణీలు ఆసుపత్రిలో డెలివరీ అయ్యే విధంగా చూస్తూ తల్లి బిడ్డ ప్రాణాలను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తూ దీంతోపాటు సీజనల్ వ్యాధులు అంటువ్యాధులు దీర్ఘకాలిక వ్యాధులను అరికడుతున్నారన్నారు.సబ్ సెంటర్ డ్యూటీలు ఏఎన్సీ, పిఎన్ని టార్గెట్స్ ఎన్సిడీ ఆన్లైన్ సర్వే స్పూటమ్ డబ్బాలను మోయడం, ఎగ్జామ్ డ్యూటీలు, డ్రై డే, ఫ్రైడే బెడ్రన్ పల్స్ పోలియో తదితర అనేక పనులు ఉదయం నుండి రాత్రి వరకు చేస్తున్నారాన్నరు ఇంత శ్రమ చేస్తున్న ఆశాలకు వేటికీ రాష్ట్రంలో ఫిక్స్ డ్ వేతనం అమలు చేయటం సిగ్గుచేటని. కేవలం రూ. 9,900/-లు మాత్రమే పారితోషికాలు చెల్లించి శ్రమదోపిడి చేస్తున్నారని విమర్శించారు పని భారం పెరిగి వచ్చే పారితోషణాలు సరిపోక ఆశాలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఆశాలు సమస్యల పరిష్కారం కోసం 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు నిరవధిక సమ్మె చేశారు సమ్మె సందర్భంగా అక్టోబర్ 9న హైదరాబాద్ కోరి కమీషనర్ ఆఫీస్ ముందు జరిగిన ధర్నా సందర్భంగా గత ప్రభుత్వం ఆనాటి ఉన్నతాధికారులు నాయకులతో చర్చలు జరిపారు అశాల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ తో కూడిన కమిటీని వేస్తామని, ఈ కమిటీ అశాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఆశాలకు వేతనాలు పెంచుతాదుని ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీనిచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు అశాలు చేస్తున్న పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని మేము అధికారంలోకి వస్తే ఆశలు అడుగుతున్న డిమాండ్స్ అన్నింటినీ పరిష్కారం చేస్తామని హామీనిచ్చారన్నారు ఆశాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్రంలో ఆశాలు అనేక పోరాటాలు చేశారు హైదరాబాద్ కోరి కమీషనర్ ఆఫీస్ వద్ద చేసిన పోరాటాల సందర్భంగా 2024 ఫిబ్రవరి 9 జూలై 30న డిసెంబర్ 10న రాష్ట్ర ఉన్నతాధికారులు ఆశాలకు చూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50,000/- మట్టి ఖర్చులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ సెలవులు టార్గెట్స్ స్పూటన్ డబ్బాలు మోయడం రద్దు ప్రమోషన్స్ సౌకర్యం కల్పిస్తామని రూ.18వేలు ఫిక్స్డ్ వేతనం కోసం ఫైల్ ప్రాసెస్లో ఉందని చెప్పారు కానీ ఇప్పటివరకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని,అందుకని పారిశ్రామిక వివాదాల చట్టం– 1947లోని సెక్షన్– 22,సబ్ సెక్షన్ 1ని అనుసరించి ఈ సమ్మె నోటీస్ ఇస్తున్నామని డిసెంబర్ 15 లోపు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తదితర ఆశాలు వర్కర్స్ పాల్గొన్నారు.



మనం
మధిర - ఎర్రుపాలెం - బోనకల్- చింతకాని - ముదిగొండ



అన్నదాన కార్యక్రమం



మధిర,నవంబర్3(మనం న్యూస్): మధిర శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం వర్తక సంగంలో వేంచేసి ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు ప్రతి మంగళవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం వారి సాయంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని నిర్వాహకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కపిలవాయి జగన్మోహనరావు,వెచ్చ శ్రీనివాసరావు , కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సుల ప్రవేశ గడువు పొడిగింపు

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శంకర్

ఖమ్మం, నవంబర్ 03(మనం న్యూస్): ప్రభుత్వ వైద్య కళాశాల, ఖమ్మం నందు డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సుల్లో (2 సంవత్సరాల వ్యవధి) ప్రవేశాలకు సంబంధించి గడువును నవంబర్ 13 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు కోర్సుల్లోనూ చెరో 30 సీట్ల చొప్పున (మొత్తం 60 సీట్లు) అందుబాటులో ఉన్నాయని, అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సుల్లో 30 చొప్పున మొత్తం 60 సీట్లు ఉన్నట్లు, కోర్సు వ్యవధి 2 సంవత్సరాలని తెలిపారు. అర్హులైన విద్యార్థులలో మొదట బైపిసి విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తారని, ఆ తర్వాత ఎంపిసి, ఇతర అర్హత కలిగిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ప్రిన్సిపాల్ అన్నారు. ముందుగా https://www.tgpmd.telangana.gov.in వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఆన్లైన్ దరఖాస్తు ఫారమ్ను ప్రింట్ తీసి, అవసరమైన అన్ని ధ్రువపత్రాల (సర్టిఫికెట్ల) నకళ్లను జతచేసి 'ప్రభుత్వ వైద్య కళాశాల, ఖమ్మం' కార్యాలయంలో నేరుగా సమర్పించాలని అన్నారు. దరఖాస్తుల సమర్పణకు పూర్వం అక్టోబర్ 31, 2026 చివరి తేదీగా నిర్ణయించగా, విద్యార్థుల సౌకర్యార్థం ఆ గడువును 13 నవంబర్ 2026 సాయంత్రం 5:00 గంటల వరకు పొడిగించినట్లు తెలిపారు. అర్హత కలిగిన ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

టైలర్ కోట రవికి ఫ్రెండ్స్ ఫౌండేషన్ (ఎఫ్2) సభ్యుల ఘన నివాళి

ఖమ్మం, నవంబర్ 3(మనం న్యూస్): అనారోగ్యంతో అక్టోబర్ 23న మృతి చెందిన టైలర్ కోట రవికి ఫ్రెండ్స్ ఫౌండేషన్ (ఎఫ్2) సభ్యులు ఘన నివాళులర్పించారు. నవంబర్ 3న రవి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పిస్తూ, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఫ్రెండ్స్ ఫౌండేషన్ (ఎఫ్2) తరపున కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కె.వి. నరసింహారావు, బి. శంకరాచారి, ఎం.డి. కరీముల్లా, వి. పాపారావు, బి. రామారావు, ఎస్.కె. పెంటు సాహెబ్, కె. రాము, వి. వెంకటేశ్వర్లు, సమ్మయ్య, ఎం. వీరన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మనం

సత్తుపల్లి
సత్తుపల్లి మున్సిపాలిటీ - సత్తుపల్లి మండలం - వేంసూరు - పెనుబల్లి

కందుకూరులో 5న ఉచిత మెగా వైద్య శిబిరం

– సింధు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహణ

– రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారధి రెడ్డి చొరవ

వేంసూరు, నవంబర్ 03, (మనం న్యూస్):గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను చెంతకే చేర్చాలనే ఉన్నత లక్ష్యం తో ఈ నెల 5న (రేపు) వేంసూరు మండలం కందుకూరులో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హెటిరో గ్రూప్, సింధు హాస్పిటల్స్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారధి రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ఉచితంగా పరీక్షలు, చికిత్సల మార్గదర్శకత్వం అందించనున్నట్లు స్పష్టం చేశారు. సింధు హాస్పిటల్స్‌కు చెందిన నిపుణులైన వైద్య బృందం పాల్గొని జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్: సాధారణ రోగాలు, ఎముకలు-కీళ్ల నొప్పుల పరీక్షలు, కార్డియాలజీ, ఆంకాలజీ: గుండె సంబంధిత సమస్యలు, క్యాన్సర్ ముందస్తు నిర్ధారణ, గైనకాలజీ, ప్లాస్టిక్ సర్జరీ: స్త్రీల ఆరోగ్య సమస్యలు, సర్జికల్ నిపుణుల సలహాలు, డయాబెటిక్ ఫుట్ కేర్: మధుమేహ బాధితుల పాదాల సమస్యలకు ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా తీవ్ర ముప్పును నివారించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు, ముఖ్యంగా గ్రామీణులు ఈ ఉచిత అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మురసు తుఫాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 3 (మనంప్రతినిధి):
మురసు తుఫాను ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వర్షపాత పరిస్థితులు, ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర సహాయక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ హెచ్చరికలు, వర్షపాత తీవ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. తహశీల్దార్లు, ఎంపీడీవోలు, జీపీవోలు, పంచాయతీ కార్యదర్శులు విధిగా తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపల్ ప్రాంతాల్లో టాంటాం ద్వారా ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తం చేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, అందులో నివసిస్తున్న వారిని అవసరమైన మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పాత, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల పరిస్థితులను పరిశీలించి విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, డ్రైనేజీలు, ఓపెన్ నాలాలను నిరంతరం పర్యవేక్షిస్తూ నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాత వంతెనలు, కల్వర్టులు, ప్రమాదకర రహదారులను పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన 94 ప్రమాదకర రహదారుల వద్ద అవసరమైన చోట ముందస్తుగా బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో ప్రజల రాకపోకలను నియంత్రించా లని, చేపల వేట, పర్యాటక కార్యకలాపాలకు అనుమతించవద్దని అటవీ శాఖ అధికారులకు సూచించారు. మైనింగ్ కార్యకలాపాలపై కూడా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.

ప్రజల సహాయార్థం 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాలు, తుఫాను ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణ సహాయం అందించేందుకు కొత్తగూడెంలోని ఐడీఓసీ కార్యాలయం, గది నంబర్ ఎఫ్-28లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు అత్యవసర సమాచారం, వర్షాలు, వరదల కారణంగా ఎదురయ్యే సమస్యలను కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు 08744-241950, 9392919743 ద్వారా తెలియజేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది నిరంతరం విధుల్లో ఉంటూ ఫిర్యాదులను ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి, సంబంధిత శాఖలకు వెంటనే తెలియజేసి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ప్రతి తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి వచ్చే సమాచారంపై తక్షణమే స్పందించాలని సూచించారు. అధికారులు విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రాధాన్యతనిస్తూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. టెలికాన్ఫరెన్స్లో మండలాల వారీగా వర్షపాత పరిస్థితులను అధికారులు వివరించారు. చర్ల, దుమ్ముగూడెం, మణుగూరు, పినపాక మండలాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తుండగా, అశ్వారావుపేటలో మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తున్నట్లు తెలిపారు. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు మున్సిపాలిటీల్లో సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేసి పారిశుద్ధ్య, డ్రైనేజీ నిర్వహణ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

– వర్షాల నేపథ్యంలో పంటల రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

– ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

సత్తుపల్లి, నవంబర్ 03 (మనం న్యూస్): మురసు తుపాను ప్రభావంతో సత్తుపల్లి ప్రాంతంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సూచించారు. తుపాను ప్రభావంతో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని కారణంగా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. ముఖ్యంగా రైతులు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తమ పంటలను కాపాడుకునేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలను వర్షాలకు తడవకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ధాన్యం నిల్వల విషయంలో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.అదేవిధంగా ప్రజలు అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, పాత ఇళ్లలో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాల సమయంలో



చెట్లు, విద్యుత్ స్తంభాలు, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరారు. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, అధికారులు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఒక్కరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, రైతులు తమ పంటల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు పరామర్శ..





– ప్రముఖ వ్యాపారవేత్తకు నివాళులు

సత్తుపల్లి టౌన్ , నవంబర్ 04 (మనం న్యూస్) : సత్తుపల్లి పట్టణంలో పర్యటించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ విజయ్ కుమార్ పలు కుటుంబాలను పరామర్శించారు. పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న నరుకుళ్ల అప్పారావు సతీమణి చల్లగుళ్ల మధులత ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆమె నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మధులత త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అదేవిధంగా పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నడిపల్లి జనార్దన్ రావు ఇటీవల మృతి చెందడంతో ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావుతో పాటు సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలు లేవు.. అయినా 24.7 రాజకీయ రచ్చ

- **పాలేరు రాజకీయాలకు ఎదులాపురమే కేంద్ర బిందువు..**
- **కామ్రేడ్స్.. వారియర్స్.. కాంగ్రెస్.. ఎవరికి వారే ప్రత్యేకం..**
- **వాట్సాప్ గ్రూపుల్లో ఫొటోల పోటీ.. పోస్టుల హోరు..**





ట్యాగ్‌లతో రాజకీయ సందడి

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 3(మనం న్యూస్) : సాధారణంగా ఎన్నికల సమయం వచ్చిందంటేనే రాజకీయ సందడి కనిఎ స్తుంది. కానీ పాలేరు నియోజకవర్గంలో మాత్రం ఎన్నికలతో సంబంధం లేకుండానే రాజకీయ చర్చలు నిరంతరం కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఎదులాపురం మున్సి పాలిటీ కేంద్రంగా కామ్రేడ్స్.. వారియర్స్.. కాంగ్రెస్ రాజకీయ కార్యకలాపాలు, సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్న పోటాపోటీ ప్రత్యేక చర్చనీయాంశంగా మారాయి.

కామ్రేడ్స్.. వారియర్స్.. కాంగ్రెస్.. ఎవరికి వారే ప్రత్యేకం

ఎవరికి వారే తమ నాయకుల కార్యక్ర మాలు, ఫొటోలు, రాజకీయ ప్రాధాన్యతను సామాజిక మాధ్యమాల ద్వారా చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో ఒక వర్గం నాయకుడి ఫొటో పెడితే.. మరో వర్గం తమ నాయకుడి కార్యక్రమానికి సంబంధించిన ఫొటోను పోస్టు చేయడం, పర స్పరం ట్యాగ్‌లు చేసుకోవడం, వ్యాఖ్యలకు ప్రతివ్యాఖ్యలు ఇవ్వడం నిత్యకృత్యంగా మారింది. దీంతో గ్రూపుల్లో రాజకీయ చర్చలకు కొదవ లేకుండా పోతోంది.

ప్రజా సమస్యల కంటే రాజకీయ ప్రాధాన్యతకే పెద్దపీట!

మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం, తాగునీరు, అభివృద్ధి పనులు వంటి ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన వేదిక ల్లోనూ రాజకీయ నాయకుల కార్యక్రమా లు, కార్యకర్తల చురుకుదనం, నాయకుల ప్రాధాన్యత, రాజకీయ ఆధిపత్యంపై చర్చ లు చోటుచేసుకుంటున్నాయి. ప్రతి ఫొటో కు ఒక రాజకీయ అర్థం.. ప్రతి పోస్టుకు మరో చర్చ అన్నట్లుగా సామాజిక మాధ్య మాల్లో రాజకీయ వాతావరణం కనిపిస్తోంది.

ఎన్నికల షెడ్యూల్ లేదు.. అయినా రాజకీయాలకు విరామం లేదు

ప్రస్తుతం ఎన్నికల ప్రచారం లేదు.. ఓట్ల లెక్కలు లేవు.. బహిరంగ రాజకీయ పోటీ లేదు. అయినప్పటికీ నాయకులు, కార్య కర్తలు, అభిమానుల మధ్య రాజకీయ ఉత్సాహం మాత్రం కొనసాగుతోంది. కామ్రేడ్స్.. వారియర్స్.. కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు తమ తమ కార్యక్ర మాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సామా జిక మాధ్యమాలను వేదికగా చేసుకుం టున్నారు. ఈ పరిణామాలు కేవలం అభిమానుల మధ్య పోస్టుల పోటీగా మిగిలిపోకుండా భవిష్యత్తులో స్థానిక రాజకీయ చర్చలకు, కొత్త సమీకరణాలకు కూడా వేదికయ్యే అవకాశాలున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి..

–మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య..

తల్లాడ, నవంబర్ 3 (మనం న్యూస్): తల్లాడ పట్టణంలోని నారాయణపురం గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్ రెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కరువు మండలాలను ప్రభుత్వం పేరుకే ప్రకటించిందని, క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి స్పష్టత, భరోసా కల్పించడం లేదని అన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ పంట విరామం పాటించాలని రైతులకు సూచించడం, ఎరువుల దుకాణాలకు నోటీసులు ఇవ్వడం మినహా రైతులకు జరుగుతున్న మేలు ఏమిటని ప్రశ్నించారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంట తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అయినప్పటికీ ఇప్పటివరకు ఒక్కచోట కూడా పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సైతం ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.పది రోజుల క్రితం క్వింటాల్ ధాన్యాన్ని రూ.4,200 చొప్పున కొనుగోలు చేసిన వ్యాపారులు, ప్రస్తుతం ఒక్కసారిగా ధర తగ్గించి రూ.2,800కే విక్రయించాలని రైతులపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. వేంసూరు మండల రెవెన్యూ పరిధిలోని కందుకూరు, మర్లపాడు, లింగపాలెం



గ్రామాల్లో విద్యుత్, సాగునీటి సౌకర్యాలు లేక వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. పంట నష్టంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేసి అర్హులైన రైతులకు తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాల్, పట్టణ అధ్యక్షుడు జి.వి.ఆర్., ఉపసర్పంచ్ కేతినేని చలపతిరావు, నాయకులు దిరిశాల దాసురావు, కోడూరు వీరకృష్ణ, మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో బాలభారతి విద్యార్థులు..

– అభినందించిన కరస్పాండెంట్ ప్రవీణ్..

తల్లాడ, నవంబర్ 3 (మనం న్యూస్): భారతదేశవ్యాప్తంగా జరిగిన రీడ్ ఇండియా సెలబ్రేషన్ లో బాలభారతి విద్యాలయం విద్యార్థులు 10మంది అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా సుమారు 20 రాష్ట్రాల నుండి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనగా 142 మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అందులో తెలంగాణ నుండి 13 మంది విద్యార్థులు ఎంపిక కాగా, వారిలో బాలభారతి విద్యార్థిని విద్యార్థులు 10 మంది ఉండడం గమనార్హం. అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు షేక్ సమీహ, బి లోహిత, ఎస్ శ్రీ సంధ్య ,ఆర్ శైలజ, కె కమల , కె హితేష్ శ్రీరంగ, ఈ జస్వంత్, కె ఉమాంజలి, ఆర్ రేష్మిత,ఐ తీనా తన్విక లను మండల విద్యాశాఖ అధికారి ఎన్ .దామోదర్ ప్రసాద్, విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ ,డైరెక్టర్ కోటగిరి



.శ్రావణి, ప్రిన్సిపల్ తాళ్లూరి రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

గురువాయురప్పన్ కల్చరల్ ఫెస్టివల్ కేరళ 2026లో సత్తా చాటిన

స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విద్యార్థిని ఆర్.దేశ్న

ఖమ్మం, నవంబర్ 3(మనం న్యూస్)ః స్థానిక శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ విద్యార్థిని ఆర్. దేశ్న మెల్బతూర్ ఆడిటోరియంలో గురువాయురప్పన్ కల్చరల్ ఫెస్టివల్ వారిచే నిర్వహించబడిన భరతనాట్య విభాగంలో పాల్గొని తన నృత్యంతో అలరించడమే కాకుండా అసాధారణ ప్రతిభతో భరత నాట్యం జూనియర్స్ వ్యక్తిగత విభాగంలో మైమరపించే నృత్య ప్రదర్శనకు ఆర్గనైజర్స్ వారిచే మెడల్, సర్టిఫికెట్‌ను స్వీకరించి ఘనమైన సత్కారాన్ని పొంది సత్తా చాటింది. ఈ అభినందన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్స్ కొండా శ్రీధర్ రావు, కృష్ణవేణి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యం నుండే విద్యతో పాటు వివిధ కళలపై ఉన్న ఆసక్తికి అనుగుణంగా వారికి



నిష్ణాతులైన మాస్టర్స్‌చే నైపుణ్య శిక్షణ ఇస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలియజేశారు. ఆరవ తరగతి చదువుతున్న ఆర్.దేశ్న అతి చిన్న వయసులోనే ఇతర రాష్ట్రాలలో తన ప్రతిభను కనబరచడం చాలా గొప్ప విషయం అంటూ భవిష్యత్తులో ఇంకా మరెన్నో విజయాలను సాధించి ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదిస్తూ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.సురేష్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని విజేతను అభినందించారు.

మండలంలో రైతులకు ఎల్ నినో పై అవగాహన..

తల్లాడ, నవంబర్ 3 (మనం న్యూస్): తల్లాడ మండల పరిధిలోని బాలపేట సర్పంచ్ కోసూరి ధనలక్ష్మి, మల్లారం సర్పంచ్ కటికి కిరణ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం ఎల్ఈనోపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీధర్ రాజు, మండల వ్యవసాయ అధికారి తాజుద్దీన్, ఇరిగేషన్ ఇంజనీర్ నవ్య, ఏఈఓ హసీనా బేగం హాజరయ్యారు.కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా. పావని, ఫణిశ్రీ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.



వారు జీవన ఎరువుల ప్రాధాన్యత, భూసార పరీక్షల ఆవశ్యకత, జీవన ఎరువుల వినియోగ విధానం, ఆరుతడి పంటల సాగుపై వివరంగా వివరించారు. అనంతరం సర్పంచ్‌లు, అధికారులు శాస్త్రవేత్తలను సత్కారంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.



కల్లూరు

కల్లూరు మున్సిపాలిటీ - కల్లూరు మండలం - తల్లాడ



చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాగమయి..

తల్లాడ, నవంబర్ 3 (మనం న్యూస్): ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ మంగళవారం తల్లాడలో అందించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన లబ్ధిదారులకు ఆమె చేతుల మీద అందించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడైనా పేద ప్రజల పక్షాన నిలబడే ప్రభుత్వం అన్నారు. సీఎంఆర్ఎఫ్ గాని షాదీ ముబారక్ గాని కళ్యాణ లక్ష్మి గాని పార్టీలకతీతంగా మంజూరు చేస్తున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేకూర్చే విధంగా కృషి చేస్తానన్నారు. తల్లాడ మండలంలో ఎల్ఓసిలు కూడా పెద్ద మొత్తంలో మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

32వ జాతీయ స్థాయి కటా,వెపన్స్, కరాటే పోటీలలో రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ విద్యార్థుల ప్రతిభ

నవంబర్ 1వ తారీఖున సుమన్ షటో ఖాన్ కరాటే ఆర్గనైజేషన్ వారు .నిర్వహించిన 32వ జాతీయ స్థాయి కటా,వెపన్ కారాటే పోటీలలో రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ వీ.డి.వోస్ కాలని విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతులు సాదించారని రెజొనెన్స్ స్కూల్ డైరెక్టర్ ఆర్. వి.నాగేంద్ర కుమార్ ఒక ప్రకటనలో తెలియ జేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన సినినటుడు సుమన్ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తూ కరాటే పోటీల వలన స్వయంగా ఆత్మరక్షణ ఇతరులు దాడి చేసినప్పుడు మంచి స్థైర్యంతో మనలను మనం కాపాడుకుంటు ఎదుటి వారిని చాక చక్యంగా చెదిరించ వచ్చు అని దాని వల్లన సమాజంలో క్రమ శిక్షణ తో కూడిన విలువలు నేర్చుకోన వచ్చునని తెలియ జేసారు . డైరెక్టర్ ఆర్.వి నాగేంద్రకుమార్ తమ స్కూల్లో కో కర్కిలర్ యాక్టి విటీస్‌లో భాగంగా కోచ్ ఉపేందర్ సహకారంతో 2వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులు 20 మంది పాల్గొని జాతీయ స్థాయి పోటీలలో మేడల్స్ సాదించి జిల్లా లోని ఒక బెస్ట్ స్కూల్ గా పేరు సాదించుటకు విద్యార్థుల నైపుణ్యం ఎంతో సహకరించిందని కొనియాడారు. విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు బహుకరిచారు ఇంత చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్ కొండా .శ్రీధర్, నీలిమా ప్రత్యేకంగా అబినందించారు. ప్రిన్సిపాల్ టి. గోపాల కృష్ణ హర్షం వ్యక్తం చేసారు.



మనం
జనం కోసం అక్షర యజ్ఞం.
కొత్తగూడెం
కొత్తగూడెం కార్పొరేషన్ - సింగరేణి

నిబద్ధత గల సీనియర్ నాయకుడి కోల్పోవడం బాధాకరం

– ప్రజా, కార్మిక ఉద్యమాల్లోనాగేశ్వరరావు సేవలు మరువలేనివి
– చప్పిడి కుటుంబానికి అండగా పార్టీ నిలుస్తుంది
– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం టౌన్ నవంబర్ 3 మనం న్యూస్ : ప్రజా ఉద్యమాల్లో, కార్మిక వర్గ హక్కుల పరిరక్షణలో సీనియర్ నాయకులు చేసిన సేవలు ఎనలేనివని, వారి కృషి ఎప్పటికీ మరువలేనిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రామవరం పంజాబ్ గడ్డ ప్రాంతానికి చెందిన సిపిఐ, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు చప్పిడి నాగేశ్వరరావు ఇటీవల మృతిచెందగా, మంగళవారం వారి నివాసానికి కూనంనేని సాంబశివరావు వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగించిన నిబద్ధత గల ప్రజా నాయకుడిని కోల్పోవడం పార్టీకి, కార్మిక వర్గానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితాంతం ప్రజా సమస్యల పరిష్కారానికే అంకితమైన ఆయన చూపిన బాటలో నడవడమే వారికిచ్చే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, పట్టణ నాయకులు గుత్తుల శ్రీనివాస్, మృతుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కులాన్ని బీసీ-ఏలో చేర్చే నిర్ణయాన్ని విరమించుకోవాలి

– బీసీ-ఏలోని 57 కులాలకు అన్యాయం జరగకుండా చూడాలి
– ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

కొత్తగూడెం, టౌన్ నవంబర్ 3 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్ కులాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మేదరి సంఘం డిమాండ్ చేసింది. ఈ నిర్ణయం అమలైతే ఇప్పటికే బీసీ-ఏలో ఉన్న 57 వెనుకబడిన కులాలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర మేదరి సంఘం పిలుపు మేరకు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ కులాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే నిర్ణయాన్ని పునఃపరిశీలించి, విరమించుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ బీసీ-ఏలో ఇప్పటికే 57 వెనుకబడిన కులాలు ఉన్నాయని, ఈ కేటగిరీలోకి మరో కులాన్ని చేర్చడం వల్ల ఆయా కులాలకు విద్య, ఉద్యోగాలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో అవకాశాలు తగ్గే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెనుకబడిన కులాల హక్కులు, ప్రయోజనాలు కాపాడేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. బీసీ కులాల మధ్య న్యాయం, సమాన అవకాశాలు ఉండేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పోతు పురుషోత్తం, సెక్రటరీ నాగకృష్ణ, కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు కొంటూ శ్రీనివాస్, మష్న శ్రీనివాస్, వలిపిరెడ్డి వెంకన్న, వలిపిరెడ్డి రాజేశ్వరరావుతో పాటు పలువురు మేదరి కులస్తులు పాల్గొన్నారు.



మహిళలు ఆర్థికంగా ఎదగాలి

– వృత్తి విద్య కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి
– జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అజయ్ కుమార్

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 3(మనం న్యూస్):
మహిళలు ఆర్థికంగా ఎదగడంతో పాటుగా వృత్తి విద్య కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి జిఎం పర్సనల్ వెల్ఫేర్ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు.
సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి సేవా సమితి అధ్వర్యంలో మూడు నెలల పాటు పాత కొత్తగూడెం మహిళలకు ఉచిత టైలరింగ్, బర్లిపిట్ మహిళలకు ఉచిత మగ్గం వర్క్, గాజులరాజం బస్తి మహిళలకు ఉచిత ఫ్యాబ్రిక్ పెయింటింగ్ తరగతులను జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అజయ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సేవా సమితి ముఖ్య ఉద్దేశం ఉద్యోగుల కుటుంబ మహిళలు ప్రాజెక్టు ప్రభావిత పరిసర ప్రాంత మహిళలు ఆర్థికంగా ఎదిగి ఉపాధి పొందాలని సూచించారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులను నిర్వహిస్తున్నామని దీనిని సక్రమంగా ఉపయోగించుకొని క్రమం తప్పకుండా హాజరై కోర్సు పూర్తి చేసి మంచి శిక్షణ పొంది వృద్ధిలోకి రావాలని కోరారు. ఇందులో భాగంగా





పాతకొత్తగూడెం మహిళలకు ఉచిత టైలరింగ్, బర్లిపిట్ మహిళలకు ఉచిత మగ్గం వర్క్, గాజులరాజం బస్తి మహిళలకు ఉచిత ఫ్యాబ్రిక్ పెయింటింగ్ శిక్షణా తరగతులను ప్రారంభించుకుంటున్నామని పేర్కొన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే ఈ ఉచిత వృత్తి శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ముఖ్యంగా ఈ వృత్తి విద్యా కోర్సులు శ్రద్ధగా నేర్చుకోవాలని కోరారు.
ఈ వృత్తి శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు "ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ-హైదరాబాద్" వారిచే సర్టిఫికెట్లు కూడా అందచేయబడునని ఈ వృత్తి శిక్షణా కోర్సులు నేర్చుకున్న మహిళలు తాము నేర్చుకున్న వృత్తి శిక్షణ ద్వారా యూనిట్లను నెలకొల్పుకొని తమతో పాటు మరికొందరికి జీవనోపాధి కల్పించాలని అదేవిధంగా తాము తయారు చేసిన వాటిని హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ నందు స్టాల్స్ ఏర్పాటుచేసుకొని విక్రయించేందుకు కూడా సింగరేణి సంస్థ సహాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ తో పాటు డిజిఎం(పర్సనల్) బి.శివ కేశవ రావు, డివైపిఎం కే.శివ కుమార్, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద రావు, సేవా కొ ఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, సేవాసెక్రెటరీ మాధవీ స్వర్ణ లత, సేవా కో-ఆర్డినేటర్లు రమాదేవి, మీనాక్షి, అరుణ, పద్మావతి, దీప, శిక్షకులు ఇతర సేవా సభ్యులు అభ్యర్థులు పాల్గొన్నారు.

డిసెంబర్ 15 నుంచి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె

– రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి
– పీఎఫ్, ఈఎస్ఐతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి
– దశలవారీ ఉద్యమ కార్యాచరణ ప్రకటించిన సీఐటీయూ



కొత్తగూడెం, టౌన్ నవంబర్ 3 (మనం న్యూస్): ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్ హెచ్చరించారు. తమ హక్కుల సాధన కోసం ఆశా వర్కర్లు ఐక్యంగా దశలవారీ పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ మంగళవారం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ అధికారులకు సీఐటీయూ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా భూక్యా రమేష్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గత 20 ఏళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు అనేక వ్యయప్రయాసలకోర్చి ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలు ఉదయం నుంచి రాత్రి వరకు ఫీల్డ్ వర్క్, ఆన్‌లైన్ సర్వేలు, వివిధ రకాల టార్గెట్లు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల విధులను నిర్వహిస్తూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి బాధ్యతలు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు కేవలం రూ.9,900 మాత్రమే పారితోషికంగా చెల్లించడం అన్యాయమని విమర్శించారు. ఇతర ఉద్యోగులకు లభించే కనీస సౌకర్యాలు సైతం ఆశా వర్కర్లకు కల్పించడం లేదన్నారు. తమ సమస్యలను గతంలో అనేకసార్లు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. హామీల అమలు కోసం ప్రశ్నిస్తున్న ఆశా వర్కర్లను నిర్బంధాలకు గురిచేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు.

దశలవారీ పోరాట కార్యాచరణ ప్రకటన

ఆశా వర్కర్ల సమస్యల సాధన కోసం చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణను సీఐటీయూ ప్రకటించింది. నవంబర్ 10న రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలకు సమ్మె నోటీసులు అందజేయనున్నారు. నవంబర్ 15న జిల్లా సదస్సు నిర్వహించనుండగా, నవంబర్ 16న కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టనున్నారు. నవంబర్ 20న సంబంధిత మంత్రులకు సమ్మె వినతిపత్రాలు అందజేయనున్నారు. అదేవిధంగా డిసెంబర్ 5 నుంచి 10వ తేదీ వరకు కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లకు, గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు వినతిపత్రాలు అందజేసి తమ పోరాటానికి మద్దతు కూడగట్టనున్నారు. మండల స్థాయిలో సంబంధిత అధికారులకు సైతం సమ్మె నోటీసులు అందజేయనున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలపై సానుకూలంగా స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని భూక్యా రమేష్ కోరారు. లేనిపక్షంలో డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె చేపట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు గంగా, మనీలా, రామసీత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే సామాజిక న్యాయం పూర్తికాదు!

– ఏజెన్సీ ప్రాంత ఎస్సీలకు రాజ్యాంగ ఫలాలు అందించాలి
– మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ చూపాలి
– బొమ్మెర శ్రీనివాస్ డిమాండ్



కొత్తగూడెం టౌన్, నవంబర్ 3 (మనం న్యూస్): ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయిందని భావించి ప్రభుత్వం చేతులు దులుపుకుంటే సరిపోదని, దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న ఏజెన్సీ ప్రాంత ఎస్సీల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెంలోని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కార్యాలయం నుంచి ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అదే స్థాయిలో ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఎస్సీల అభివృద్ధిపైనా దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా గణాంకాల సేకరణకు మాత్రమే ఏజెన్సీ ప్రాంత ఎస్సీలను గుర్తిస్తారా? లేక వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాలు అందించేందుకు కూడా చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించారు. దశాబ్దాలుగా విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రాజ్యాంగబద్ధమైన అభివృద్ధి ఫలాలకు దూరంగా ఉంటున్న ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది ఎస్సీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా చర్చించి, ఏజెన్సీ ప్రాంత ఎస్సీలకు న్యాయం జరిగేలా పరిష్కార మార్గాన్ని చూపాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న అభివృద్ధికి నోచుకోని ఎస్సీ కులాలను గిరిజనేతరులు (నాన్ ట్రైబ్స్) అనే పేరుతో ఎస్సీలకు రాజ్యాంగం కల్పించిన హోదా, హక్కులకు దూరం చేసే పరిస్థితులు నెలకొన్నాయని బొమ్మెర శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన కులాలతో సమానంగా పరిగణిస్తూ, వెనుకబడిన ఏజెన్సీ ప్రాంత ఎస్సీలను మరింత అణచివేతకు గురిచేసే ధోరణిని అగ్రవర్ణ పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంత ఎస్సీల సమస్యలపై సంబంధిత ఎస్సీ మంత్రులు, ఎమ్మెల్యేలకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ స్పందన లేకపోవడం విచారకరమన్నారు. ఎన్ని పర్యాయాలు విన్నవించినా సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోవడం వెనుక ఏజెన్సీ ప్రాంత ఎస్సీల పట్ల వివక్ష ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణతో పాటు ఏజెన్సీ ప్రాంత ఎస్సీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, విద్యా, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించే అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని బొమ్మెర శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

మనం



కొత్తగూడెం నియోజకవర్గం

కొత్తగూడెం కార్పొరేషన్ - చుంచుపల్లి - లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్

నాయి బ్రాహ్మణ ఆత్మగౌరవ భవనం కోసం వినతి పత్రం అందజేత



చంద్రుగొండ, నవంబర్ 03 (మనం న్యూస్) : చంద్రుగొండ మండలంలో నాయి బ్రాహ్మణుల ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు మంగళవారం మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. నాయి బ్రాహ్మణుల ఐక్యత, సామాజిక అభివృద్ధి, సమావేశాలు నిర్వహించుకోవడానికి ఆత్మగౌరవ భవనం ఎంతో అవసరమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి తమ చిరకాల ఆకాంక్ష అయిన ఆత్మగౌరవ భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు కొలీపాక వెంకటేశ్వర్లు కడియాల పుల్లయ్య సోమనపల్లి వెంకటేశ్వర్లు కొలిపాక అప్పారావు రాచకొండ నాగేశ్వరరావు కొదురుపాక రమేష్ దాడిగల జనార్ధన్ అద్దంకి పవన్ కొలిపాక నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధానికి సింగభూపాలెం సర్పంచ్ చొరవ

– కుటుంబ సంక్షేమం, మహిళల భద్రత, పిల్లల భవిష్యత్తే లక్ష్యంగా నిర్ణయం



సుజాతనగర్, నవంబర్ 3 (మనం న్యూస్) : మద్యపాన నిషేధం అంటే కేవలం మద్యాన్ని అరికట్టడం మాత్రమే కాకుండా, దాని వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల్లో ఆనందాన్ని నింపడం, మహిళలకు ప్రశాంతమైన జీవితాన్ని అందించడం, పిల్లలకు మెరుగైన భవిష్యత్తును కల్పించడమే ప్రధాన ఉద్దేశమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం సింగభూపాలెం గ్రామ సర్పంచ్ కిన్నెర వెంకన్న తీసుకున్న చొరవపై గ్రామ ప్రజలు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మద్యపానం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడటంతో పాటు, కుటుంబాల్లో గొడవలు, సామాజిక సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సంపాదించిన డబ్బులో అధిక భాగం మద్యానికి ఖర్చు చేయడం వల్ల పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు నిర్లక్ష్యానికి గురవుతున్న పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో సర్పంచ్ కిన్నెర వెంకన్న మద్యపాన నిషేధం దిశగా ముందడుగు వేయడాన్ని అభినందిస్తున్నారు. గ్రామ అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సామాజిక మార్పుకు కూడా కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మద్యపానం వల్ల కుటుంబాల్లో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు గ్రామస్థులందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచిస్తున్నారు. ఈ నిర్ణయం ఆచరణలో విజయవంతం కావాలంటే మహిళలు, యువత, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలందరి సహకారం అవసరమని పేర్కొంటున్నారు. మద్యపానానికి దూరంగా ఉంటూ కుటుంబ బాధ్యతలకు ప్రాధాన్యత ఇవ్వాలని యువతకు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందంటున్నారు. సర్పంచ్ కిన్నెర వెంకన్న తీసుకున్న ఈ చొరవ గ్రామంలో ఆరోగ్యకరమైన సామాజిక వాతావరణానికి బాటలు వేయాలని, మహిళలకు భరోసా కల్పిస్తూ పిల్లల భవిష్యత్తుకు పునాది కావాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతో సింగభూపాలెం మద్యపాన రహిత గ్రామంగా రూపుదిద్దుకొని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని కోరుతున్నారు.

అఖిల్ హత్య కేసులో మరో ముగ్గురు అరెస్ట్

– ఇప్పటికే నలుగురు అరెస్ట్.. తాజాగా ముగ్గురికి రిమాండ్
– మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు



కొత్తగూడెం క్రైమ్ , నవంబర్ 3 మనం న్యూస్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ గ్రామానికి చెందిన మేడి అఖిల్ హత్య కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా, తాజాగా మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఎదురుగడ్డ గ్రామానికి చెందిన సురేష్, పవన్, వినోద్‌లను లక్ష్మీదేవిపల్లి పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. హత్య కేసులో ఇప్పటికే నలుగురు అరెస్ట్ కాగా, తాజాగా మరో ముగ్గురి అరెస్ట్‌తో మొత్తం అరెస్టయిన వారి సంఖ్య ఏడుకు చేరింది. ఈ హత్య ఘటనలో నిందితుల పాత్రతో పాటు ఇతర సంబంధిత అంశాలపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ అరెస్టుల సందర్భంగా కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సీఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్సై అఖిల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో డిస్మిస్డ్ కార్మికులకు మరో అవకాశం

– పునఃపరిశీలనకు దరఖాస్తుల ఆహ్వానం
– సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 3(మనం న్యూస్):
సింగరేణి సంస్థలో 2023 నుంచి 2025 మధ్య కాలంలో విధులకు గైర్హాజరు కారణంగా తొలగించబడిన మాజీ ఉద్యోగుల కేసులను పునఃపరిశీలించాలని యాజమాన్యం నిర్ణయించింది. మళ్లీ ఉద్యోగంలోకి తీసుకునేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది. 01.01.2023 నుంచి 31.12.2025 మధ్య కాలంలో గైర్హాజరు కారణంగా తొలగించబడిన వారు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. 01.04.2026 నాటికి 46 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయస్సు కలిగి ఉండాలని పేర్కొంది. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోల్ బెల్ట్ ప్రాంత ప్రజా ప్రతినిధులతో సమావేశం సందర్భంగా డిస్మిస్డ్ ఉద్యోగులకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరిన నేపథ్యంలో ఈ అంశాన్ని పరిశీలించాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు.

ఈ నేపథ్యంలో 2023 నుంచి 2025 మధ్య కాలంలో గైర్హాజరు కారణంగా డిస్మిస్ అయిన ఉద్యోగులకు అవకాశం కల్పిస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది.

ఇవీ అర్హతలు... తొలగించబడిన కాలానికి ముందున్న గత 05 క్యాలెండర్ సంవత్సరాలలో ఏదైనా 2 సంవత్సరాలలో కనీసం 100 మస్టర్లు పూర్తి చేసి ఉండాలి. జనరల్ అసిస్టెంట్ ట్రైనీ (యూజీ), కేటగిరీ-I పోస్టులో పునఃనియామకం కోసం వైద్యపరంగా ఫిట్‌గా ఉండాలి. అర్హత కలిగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే డిస్మిస్డ్ ఉద్యోగులు తగిన ప్రొఫార్మాలో దరఖాస్తును పూర్తి చేసి తాము చివరగా పనిచేసిన గని డిపార్ట్‌మెంట్ అధిపతికి సమర్పించాలి. దరఖాస్తు సమర్పించడానికి చివరి తేదీ 14.11.2026గా సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఏరియా జనరల్ మేనేజర్లు అర్హత కలిగిన అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యల నిమిత్తం నిర్దిష్ట తేదీలోగా సంబంధిత అధికారులకు పంపించాలని కోరింది. పూర్తి వివరాల కోసం సంబంధిత గనులు లేదా శాఖల అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.



పాల్వంచ

పాల్వంచ సిటీ - పాల్వంచ మండలం

జీవవైవిధ్యాన్ని కాపాడాలి

– పర్యావరణ సమతుల్యతను పరిరక్షించాలి
– ప్రొఫెసర్ ఈసం నారాయణ



పాల్వంచ, నవంబర్ 3(మనం న్యూస్): పర్యావరణ పరిరక్షణ తోనే జీవరాశి మనుగడ సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ పేర్కొన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, కొత్తగూడెంలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నారాయణ ప్రత్యేక ప్రసంగం అందించారు. విద్యార్థినులకు ఎకాలజీ (జీవావరణ శాస్త్రం) అనే అంశంపై పొడిగింపు ప్రసంగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్‌కు చెందిన ప్రొఫెసర్ ఈసం నారాయణ ముఖ్య వక్తగా హాజరయ్యారు. విద్యార్థినులకు జీవావరణ శాస్త్రంపై అవగాహన కల్పించారు. జీవులు, వాటి పరిసరాల మధ్య ఉండే పరస్పర సంబంధాలను వివరిస్తూ.. పర్యావరణ వ్యవస్థలు, జీవ, నిర్జీవ కారకాలు, ఆహార గొలుసులు, ఆహార వలయాలు, పర్యావరణ సమతుల్యత, జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి ముఖ్యమైన అంశాలను సవివరంగా వివరించారు. ప్రకృతిలోని జీవవైవిధ్యాన్ని కాపాడటం, పర్యావరణ సమతుల్యతను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ఈ ఉపన్యాసం ద్వారా విద్యార్థినులకు జీవావరణ శాస్త్రంపై విజ్ఞానం పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కలిగినట్లయింది. ఈ కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగ అధ్యాపకులు ఎస్ సంధ్యారాణి, ప్రసన్న పాల్గొన్నారు. విద్యార్థినులు పాల్గొని, పలు విషయాలను తెలుసుకున్నారు.

గ్రాడ్యుయేట్లు వెంటనే పేరు నమోదు చేసుకోవాలి

– కాంగ్రెస్ శ్రేణులు ఓట్ల నమోదుకు చొరవ చూపించాలి
– డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు



పాల్వంచ, నవంబర్ 3(మనం న్యూస్): ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు ఈ నెల 6వ తేదీ చివరి తేదీ అని, సమయం సమీపిస్తున్నందున గ్రాడ్యుయేట్లు వెంటనే నమోదు చేసుకోవాలని, కాంగ్రెస్ శ్రేణులు ఓట్ల నమోదుకు చొరవ చూపాలని డిసిఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్కెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గతంలో ఉన్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల లిస్ట్ ను మొత్తం రద్దు చేశారని పేర్కొన్నారు. 31 అక్టోబర్ 2023 వరకు గ్రాడ్యుయేట్లు అయిన పాత, కొత్త వారు విధిగా ఓట్లు నమోదు చేసుకోవాలని అన్నారు. ఓటర్ నమోదు ప్రక్రియను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం కాంగ్రెస్ శ్రేణులు అకుంఠిత దీక్షతో పనిచేయాలని కొత్వాల అన్నారు.

పాల్వంచలో కొత్త కల్చర్ దందా!

– రియల్ ఎస్టేట్ వ్యాపారులపై బెదిరింపుల ఆరోపణలు..
– అభివృద్ధికి అడ్డంకులుగా మారుతున్నారా?
– వెంచర్లు, బిల్డర్లను లక్ష్యంగా చేసుకుంటున్నారనే విమర్శలు..
– ఎస్పీ జోక్యానికి ప్రజల విజ్ఞప్తి



పాల్వంచ, నవంబర్ 3(మనం న్యూస్): పారిశ్రామికంగా అభివృద్ధి చెంది, ప్రశాంతమైన ప్రాంతంగా పేరొందిన పాల్వంచలో కొత్త తరహా దందా మొదలైందనే ఆరోపణలు పట్టణ ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లను లక్ష్యంగా చేసుకుని కొందరు రాజకీయ నాయకులు, ఇతర వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్న చిన్న లోపాలను సాకుగా చూపుతూ.. వెంచర్లు, నిర్మాణదారులపై ఒత్తిడి తెచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు పట్టణంలో కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఒకప్పుడు పారిశ్రామికంగా వెలుగొందిన పాల్వంచ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించింది. అయితే రాష్ట్రం ఏర్పడిన అనంతరం పరిశ్రమల పరిస్థితి, స్థానికంగా ఉపాధి అవకాశాల కొరత, ఆర్థిక వనరుల లేమి పట్టణ అభివృద్ధిపై ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పాల్వంచ.. స్వరాష్ట్రంలో మాత్రం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదనే ఆవేదన స్థానికుల్లో కనిపిస్తోంది.

అభివృద్ధిపై కొత్త అడ్డంకులు? : పట్టణంలో ఎంతోకొంత ముందుకు సాగుతున్న రియల్ ఎస్టేట్ రంగం, నిర్మాణ రంగాల అభివృద్ధికి కొందరి వ్యవహారశైలి అడ్డంకిగా మారుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈజీ మనీకి అలవాటు పడిన కొందరు వ్యక్తులు వెంచర్లు, బిల్డర్లను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు దిగుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల్లో చిన్నచిన్న లోపాలను చూపిస్తూ ఒత్తిడి తెచ్చి, చివరకు సెటిల్మెంట్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు చర్చకు వస్తున్నాయి. ఇటీవల ఓ వెంచర్ వద్ద జరిగిన ధర్నా, అనంతరం చోటుచేసుకున్న సెటిల్మెంట్ వ్యవహారం పట్టణ ప్రజలను విస్మయానికి గురిచేసిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై చర్చ సద్దుమణగకముందే మరో బిల్డర్‌పై ఇదే తరహా బెదిరింపులు జరుగుతున్నాయనే ఆరోపణలు తెరపైకి రావడం ఆందోళన కలిగిస్తోంది.

భయాందోళనల్లో వ్యాపారులు.. సామాన్యులు : నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టే వారు, వెంచర్లు ఏర్పాటు చేసే వారు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తే పట్టణంలో అభివృద్ధి ఎలా సాధ్యమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవైపు పరిశ్రమలు తగ్గి ఉపాధి అవకాశాలు కరువవుతున్నాయనే ఆవేదన ఓ ప్రక్క వ్యక్తమవుతుండగా.. మరోవైపు స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఇలాంటి ఆరోపణలు రావడం పాల్వంచ భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తోంది. వెంచర్లు, బిల్డర్లకే పరిమితం కాకుండా సాధారణ ప్రజలు సైతం తమ ఆస్తులు, నిర్మాణాల విషయంలో ఇలాంటి ఒత్తిళ్లకు గురవుతామేమోనని భయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే పట్టణంలో పెట్టుబడులు పెట్టేందుకు వ్యాపారులు వెనుకడుగు వేసే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు.

ఎస్పీ జోక్యానికి విజ్ఞప్తి..
పాల్వంచలో చోటుచేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్న ఈ వ్యవహారాలపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వెంచర్లు, బిల్డర్లపై బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తుల పాత్రను పరిశీలించి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటూ అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ తరహా వ్యవహారాలకు రాజకీయ అండదండలు ఉన్నాయనే ఆరోపణలపైనా విచారణ జరపాలని కోరుతున్నారు. పాల్వంచలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడుతూ, అభివృద్ధికి ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు. ఆరోపణలు వస్తున్న ఈ తరహా దందాలకు అడ్డుకట్ట వేయాలని, బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేసే పరిస్థితులు కల్పించాలని ప్రజలు జిల్లా ఎస్పీని కోరుతున్నారు. అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటేనే పాల్వంచలో ప్రశాంతత, అభివృద్ధి కొనసాగుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మురుసు తుఫానుతో జన జీవనం అతలా కుతలం

– ఈదురు గాలులతో కూడిన వర్షం
– పాల్వంచలో స్తంభించిన జనజీవనం



పాల్వంచ, నవంబర్ 3(మనం న్యూస్):
"మురసు" తుఫాన్ ప్రభావంతో పాల్వంచ వ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. సోమవారం రాత్రి నుండి చల్లని ఈదురు గాలులు వీచి, మంగళవారం ఉదయం నుండి ఎడతెరిపి లేని వర్షానికి దారితీసింది. ఏక దాటిగా కురుస్తున్న వర్షం నేపథ్యంలో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. మరో మూడు రోజులు తుఫాన్ ప్రభావం ఉండొచ్చనే సమాచారం నేపథ్యంలో చలిగాలులతో కూడిన వర్షం ప్రజలను ఇండ్లకే పరిమితం చేసింది. ఈ ప్రభావం దినసరి వేతన కార్మికులు, కూలీలకు శాపంగా మారింది.

నేల వాలిన వరి..
తుఫాను ప్రభావంతో సోముల గూడెం, బిక్కు తండా, కమ్మరిగూడెం ప్రాంతాల్లో వరి పంట నేల వాలింది. కంకి దశకు చేరుకున్న వరి వర్షానికి పంట పొలంలో పడిపోవడంతో, రైతులు ఆందోళనకు గురయ్యారు. పంట దశకు వచ్చిన వరి, వర్షార్పణం అయ్యే అవకాశం కానున్న నేపథ్యంలో ఈ ప్రాంత రైతులు కొంత ఇబ్బంది పడ్డారు.

అంచనాకురాని పంట నష్టం?
కేవలం స్వల్ప గాలులతో కూడిన ఏకాదటి వర్షం పంటలకు కొంత ఇబ్బందిగా మారే అవకాశం ఉందనే ప్రచారం ఉంది. రెండు, మూడు రోజులు తుఫాను ప్రభావం ఇదే విధంగా ఉంటే వరి, ప్రత్తి పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రధానంగా కాయ దశలో ఉన్న ప్రత్తి పంట రంగు మారే ప్రమాదం ఉంది. ఫలితంగా పత్తి దిగుబడి కొంత ఆశాజనకంగా ఉండకపోవచ్చనే వాదనతో పాటు కొంత ఆర్థిక నష్టం వాటిల్లొచ్చనే అభిప్రాయం స్థానిక రైతాంగం నుండి వినిపిస్తోంది.

పంటలకు ఎలాంటి డోకా లేదు : వ్యవసాయ అధికారి



ఏకధాటిగా 2,3 రోజులు వర్షం కురిస్తే తప్ప, మురసు తుఫాను ప్రభావం పంటలపై ఎలాంటి ప్రభావం చూపబోదని మండల వ్యవసాయ అధికారి శంభో శంకర్ పేర్కొన్నారు. మంగళవారం నాగారం, దంతేరబోరా, సంగం, నారాయణ రావు పేట ప్రాంతాల్లో పంట పరిశీలన జరిపిన ఎంఈఓ "మనం" న్యూస్ తో మాట్లాడారు. ఇప్పటివరకు పంట నష్టంపై రైతాంగం నుండి ఎలాంటి సమాచారం లేదన్నారు. వర్షం తగ్గితే పంట నష్టంపై నిర్దిష్ట అంచనాకు రాలేమన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

– దమ్మపేట, పట్వారిగూడెం వైద్య అధికారులకు సమ్మె నోటీసు అందించిన ఆశ వర్కర్లు





దమ్మపేట,నవంబర్ 03(మనం న్యూస్): దమ్మపేట ఆశా వర్కర్లకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలకై ఈ మూడు సంవత్సరాల కాలంలో ప్రభుత్వ అధికారులు మంత్రుల దృష్టికి ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరినప్పటికీ ఏ ఒక సమస్య గురించి పట్టించుకోలేని పరిస్థితుల్లో డిసెంబర్ నెలలో నెరవేదిక సమ్మెకు వెళ్తున్నట్లు సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు,తెలిపారు.మంగళవారం దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారికి సమ్మె నోటీసు అందించటం జరిగింది. ఈ సందర్భంగా మురహరి రఘు, మాట్లాడుతూ ఆశ వర్కర్లు ఉదయం నుండి రాత్రి వరకు వివిధ రకాల పనులు నిర్వహిస్తున్నప్పటికీ కేవలం 9,900 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని,ఫిక్స్ వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు సునీత, రాధా, నాగమణి, వరలక్ష్మి ,ప్రమీల, కుమారి ,తదితరులు పాల్గొన్నారు.

పట్వారిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో సమ్మె నోటీసు ఇచ్చిన ఆశా వర్కర్లు ఆశ వర్కర్లు సమస్యలు పరిష్కరించాలని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అనేక ఆందోళనలు నిర్వహించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెడచవిన పెట్టిన కారణంగా డిసెంబర్ 15 నుండి నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ వెంకట ప్రవీణ్ కు సమ్మె నోటీసు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు శారదా, మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్ల నాయకత్వంతో చర్చలు జరిపి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీలత,నాగమణి, భాగ్యమ్మ ,కృష్ణవేణి ,అంజలి, జైనవి, సరోజినీ,తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో దమ్మపేటలో పర్యటించిన తహశీల్దార్, సర్పంచ్ పగడాల

దమ్మపేట నవంబర్ 3 : (మనం న్యూస్): ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ,తుఫాను ప్రభావంతో దమ్మపేట గ్రామ పంచాయతీ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గ్రామంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచే పరిస్థితులను అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా దమ్మపేట తహశీల్దార్, మద్దినేని మురళి, దమ్మపేట సర్పంచ్ పగడాల రామదేవి, రాంబాబు, గ్రామంలోని పలు వీధులు, మురుగునీటి కాలువలు, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా కాలువల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు ఏర్పడుతున్నాయో, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే పరిస్థితులు ఉన్నాయో పరిశీలించారు. వర్షపు నీరు సక్రమంగా బయటకు వెళ్లేలా కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. అలాగే వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాల సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంచాయతీ సిబ్బంది, అధికారులు సమన్వయంతో పనిచేస్తారని పేర్కొన్నారు.

ఏఐకెఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

– 15 తేదీన నల్గొండ బహిరంగ సభకు జిల్లా నుండి నాలుగు వేల మంది హాజరు
– సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

కొత్తగూడెం టౌన్, నవంబర్ 3 (మనం న్యూస్): ఈనెల 15 నుండి 18 వరకు నల్గొండలో జరిగే అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ పిలుపునిచ్చారు. స్థానిక మంచి కంటి భవన్లో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ దేశవ్యాపిత రైతాంగ ఉద్యమాలకు నాలుగు రోజులపాటు నల్లగొండలో జరిగే అఖిల భారత కిసాన్ మహాసభలు వేదిక కానున్నాయని తెలిపారు. ఈనెల 15వ తేదీన లక్షమంది రైతులతో బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పదివేల మంది రెడ్ షర్ట్ వాలంటీర్లతో కవాతు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ మహాసభల సందర్భంగా జరిగే బహిరంగ సభకు జిల్లాలో రైతాంగాన్ని కదిలించడానికి,మహాసభల జయప్రదానికై జిల్లా వ్యాప్తంగా ప్రచారం,గ్రూప్ మీటింగ్ ల ద్వారా రైతాంగాన్ని కదిలించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నుండి నాలుగు వేల మంది రైతాంగాన్ని కదిలించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పచెప్పే కుట్రలకు వ్యతిరేకంగా రైతాంగాన్ని ప్రజలను కదిలించి భవిష్య పోరాటాలు నిర్వహించి భూమి నుండి రైతును వేరు చేయకుండా కాపాడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఎలినీనో ప్రభావం వలన నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.దొడ్డి దారిన అమలు చేయాలని చూస్తున్న రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తిప్పికొట్టడానికి రైతాంగాన్ని పోరాటాలకు సిద్ధం చేసేందుకు జాతీయ మహాసభలలో ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు.రైతాంగ ఉద్యమాల బలోపేతానికి,రైతు రక్షణ కొరకు జరుగుతున జాతీయ మహాసభల జయప్రదానికి జిల్లా నుండి భాగస్వామ్యం ఉండాలని తెలిపారు.రైతులకు మద్దతుగా రైతు క్షేమాన్ని కోరుకునే ఇతర ప్రజానికాన్ని కూడా నల్గొండకు తరలించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ కారం పుల్లయ్య కె బ్రహ్మచారి లిక్కి బాలరాజు రేపాకుల శ్రీనివాస్ జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ ఎస్ఏ నబి గడ్డం స్వామి భూక్య రమేష్ కోటాల్ వీర్ల రమేష్ పద్మ చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.



మనం
జనం కోసం అక్షర యుద్ధం.



అశ్వారావుపేట
అశ్వారావుపేట - దమ్మపేట - అన్నపురెడ్డిపల్లి - చంద్రుగొండ - ములకలపల్లి

సామాన్య కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే జారె



దమ్మపేట, నవంబర్ 03 (మనం న్యూస్) : అశ్వారావుపేట నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన సామాన్య ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నేపథ్యంలో వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఈ క్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి కోసం సంప్రదించిన 156 మంది బాధితులకు సంబంధించిన మెడికల్ బిల్లులు హైదరాబాద్ తెలంగాణ సచివాలయంలోని ముఖ్యమంత్రి సహాయనిధి విభాగంలో సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,అందజేశారు. ఈ సందర్భంగా పేద మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే వివరించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స పొందలేకపోతున్న పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ఎంతో ఉపయోగక రంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి బాధితుడికి ప్రభుత్వ సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రావు రఘుకు ఎమ్మెల్యే జారె ప్రశంస



దమ్మపేట, నవంబర్ 03 (మనం న్యూస్): దమ్మపేట మండలం మొద్దులగూడెం గ్రామంలో పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమంలో దాదాపు 90 శాతం నమోదు పూర్తి చేసినందుకు గాను కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రావు రఘు,ను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా మొద్దులగూడెం గ్రామం ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని, దీనికి కారణం అక్కడ ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కృషేనని అన్నారు. భవిష్యత్తులో కూడా పార్టీ ప్రతి కార్యక్రమాన్ని ఇదే విధంగా విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

వివాహిత అదృశ్యం



దమ్మపేట, నవంబర్ 03 (మనం న్యూస్): దమ్మపేటకు చెందిన పండేటి వెంకయ్య కుమార్తె ఏలూరు జిల్లా దేవులపల్లి గ్రామానికి చెందిన కుప్పల రామాంజలీ, w/o రాజు అదృశ్యంయింది. 2/11/2026 సోమవారం రాత్రి నుంచి తన కుమార్తె కనిపించడం లేదని దమ్మపేట గ్రామానికి చెందిన పండేటి వెంకయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దమ్మపేట ఎస్సై బి రాజేష్ కుమార్, తెలిపారు.

మనం
మనం కోసం అక్షర యజ్ఞం.



భద్రాచలం
భద్రాచలం - దుమ్ముగూడెం

నిరుద్యోగ గిరిజన యువతకు ఉచిత పోలీసు శిక్షణ తరగతులు : పీవో

భద్రాచలం ఐటిడిఏ, నవంబర్ 3 (మనం న్యూస్):
భద్రాచలం పట్టణంలో నిరుద్యోగ గిరిజన యువత కోసం ఏర్పాటు చేసిన ఉచిత పోలీసు శిక్షణ తరగతులను ప్రాజెక్టు అధికారి రాహుల్ ఆకస్మికంగా పరిశీలించారు. తరగతి గదిలో అభ్యర్థులతో కలిసి కూర్చుని బోధకులు చెబుతున్న చరిత్ర పాఠాలను ఆయన శ్రద్ధగా విన్నారు.అభ్యర్థులు క్రమశిక్షణతో తర్ఫీదు పొంది పోలీసు కొలువులు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు.బోధకులు చెప్పే ముఖ్యాంశాలను నిత్యం రాసుకుంటూ రాత్రి వేళల్లో పునశ్చరణ చేసుకుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుందని మార్గదర్శనం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర, ఇతర ముఖ్యమైన విషయాలను తరచూ అధ్యయనం చేస్తూ భయం వీడి పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఇతర పోటీ పరీక్షలకు కూడా సిద్ధం కావాలని యువతకు సూచించారు.సమయాన్ని వృథా చేయకుండా పట్టుదలతో సాధన చేసి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర



నిర్వాహకుడు వీరు నాయక్, అధికారులు రమేశ్, సర్వేశ్వర్ దొర, మోహన్, వసంతం, పార్వతి, అభ్యర్థులు పాల్గొన్నారు.

వాసవి సేవా సంస్థ అంతర్జాతీయ నాయకత్వ సద్భావన యాత్ర



భద్రాచలం ,నవంబర్ 3(మనం న్యూస్): భద్రాచలం పట్టణంలో వాసవి సేవా సంస్థ అంతర్జాతీయ నాయకత్వ సద్భావన యాత్ర ఘనంగా సాగింది. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక బడి ప్రాంగణంలో ప్రతిష్ఠించిన జ్ఞాన సరస్వతి దేవి ప్రతిమను సంస్థ అంతర్జాతీయ సారథి సిద్ధ వెంకట సూర్య ప్రకాశరావు ఆవిష్కరించారు. ఈ సభ స్థానిక సంస్థ నాయకుడు వనమా కిరణ్ కుమార్ అధ్యక్షతన కొనసాగింది. విశిష్ట ఆహ్వానితులుగా సంస్థ ప్రధాన కార్యదర్శి దర్శి శ్రీనివాసరావు, జిల్లా పాలనాధికారి చారుగుళ్ల శ్రీనివాస్ విచ్చేశారు.?ఈ వేదికపై సిద్ధ వెంకట సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ---సర్కారు బడి ఆవరణలో చదువుల తల్లి ప్రతిమను నెలకొల్పడం ఎంతో శుభదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు నిత్యం అమ్మవారి కరుణాకటాక్షాలు పొందుతూ విద్యాభ్యాసంలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదిగి లోకానికి, మాతృభూమికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థులకు గణిత పరికరాల పెట్టెలు, కలములు, తీపి పదార్థాలు, చిరుతిళ్లు పంచారు. మధ్యాహ్న భోజన వంట సిబ్బందికి చీరలు బహూకరించారు. పట్టణంలోని ఆంజనేయ స్వామి ఉద్యానవనంలో యాత్రికుల విశ్రాంతి నిమిత్తం రెండు సిమెంట్ దిమ్మె బల్లలను ఉచితంగా సమకూర్చారు. ?ఈ సేవా కార్యక్రమంలో కార్యవర్గ ప్రతినిధులు చింతల వినోద్ కుమార్, రేపాక ధనుంజయ రాజ మనోహర్, ఉడతా నగేష్ కుమార్, పెనుగొండ సంతోష్ కుమార్, నాలా సాయిచంద్, బండారు కృష్ణయ్య, బచ్చు సాగర్, పెద్దలు వనమా రామారావు, చారుగుండ్ల రామకృష్ణ, రేపాక సాయి అఖిల్, గుడుమాసు వెంకట సత్యనారాయణ, సముద్రాల అనిల్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు కారం పాపయ్య, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బాణసంచా కాల్పులపై విద్యార్థులకు అవగాహనా సదస్సు

భద్రాచలం, నవంబర్ 3 (మనం న్యూస్):దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చే వేళ పాటించాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, రక్షణ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చైతన్య ఉన్నత పాఠశాల, కృష్ణవేణి తెలంగాణ మైనారిటీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో అగ్నిమాపక కేంద్ర అధికారి జి. శ్రీనివాస్, సిబ్బంది రాంబాబు, పఠాన్, నవీన్ పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

పాటించాల్సిన జాగ్రత్తలు.....
బాణసంచా కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి.
బహిరంగ ప్రదేశాలలో మాత్రమే బాణసంచా కాల్చాలి.
నూలు వస్త్రాలు ధరించాలి.
నీరు, ఇసుక, అగ్నిమాపక సాధనాలను అందుబాటులో ఉంచుకోవాలి.
తారాజువ్వలను ఖాళీ ప్రదేశాలలో సురక్షితంగా ఎగురవేయాలి.
కాలిన బాణసంచా వ్యర్థాలను నీటిలో



తడిపిన తర్వాతే పారవేయాలి.

చేయకూడని పనులు:
చేతిలో పట్టుకొని బాణసంచా వెలిగించకూడదు.
బాణసంచాను దుస్తుల జేబుల్లో ఉంచుకోకూడదు.
వెలగని టపాసులను వెంటనే మళ్లీ వెలిగించే ప్రయత్నం చేయరాదు.
నివాసాల లోపల, వాహనాల వద్ద, ఇంధన విక్రయ కేంద్రాల సమీపంలో బాణసంచా కాల్చకూడదు.
పట్టు లేదా నైలాన్ వంటి కృత్రిమ దారాల దుస్తులు ధరించి బాణసంచా కాల్చరాదు.
మత్తు పానీయాలు సేవించి బాణసంచా ముట్టించకూడదు.
అనుకోని అగ్ని ప్రమాదాలు లేదా ఆపత్కాల పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే 101 లేదా 112 సంఖ్యలకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు పండుగను ఎటువంటి ప్రమాదాల బారిన పడకుండా, క్షేమంగా, సంతోషంగా జరుపుకోవాలని అగ్నిమాపక సిబ్బంది పిలుపునిచ్చారు.

"మీ రక్షణే మా బాధ్యత -- ప్రమాదరహిత దీపావళే మన లక్ష్యం."

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మహిళకు 'వసుధ ఫౌండేషన్' అండ:

రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత

భద్రాచలం, నవంబర్ 3



(మనం న్యూస్): కిడ్నీ సంబంధిత తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ, ఆర్థిక స్తోమత లేక వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్న ఓ నిరుపేద మహిళకు ప్రముఖ స్వచ్ఛంద సంస్థ 'వసుధ ఫౌండేషన్' చేయూతనందించింది. భద్రాచలానికి చెందిన అర్జునపూడి నవత అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఫౌండేషన్ నిర్వాహకులు మానవతా దృక్పథంతో స్పందించారు.ఆమె వైద్య చికిత్స ఖర్చుల నిమిత్తం ఫౌండేషన్ చైర్మన్ శ్రీ మంతెన వెంకట రామరాజు ఆదేశాల మేరకు రూ.10,000 ఆర్థిక సహాయాన్ని ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాస్ రాజు బాధిత కుటుంబానికి అందజేశారు.?ఈ సందర్భంగా యువ నాయకులు కుంజా సంతోష్ మాట్లాడుతూ.. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలోని పేదలకు విద్య, వైద్యం తదితర రంగాల్లో వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఆపదలో ఉన్నవారిని గుర్తించి ఆర్థిక సాయం అందించడం ద్వారా నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబాలకు కొండంత భరోసా కలుగుతోందని తెలిపారు. మానవత్వంతో సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు మరెందరికో స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులతో పాటు అర్జునపూడి సక్కుబాయి, హరిబాబు, రాజేష్, సాయి కౌశిక్, సవలం వంశీ తదితరులు పాల్గొన్నారు. తమకు సకాలంలో అండగా నిలిచిన వసుధ ఫౌండేషన్ నిర్వాహకులకు బాధిత కుటుంబం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.

పెద బండిరేవులో ఉచిత వైద్య శిబిరం

దుమ్ముగూడెం నవంబర్ 3 (మనం న్యూస్): దుమ్ముగూడెం మండల పరిధి పద్మశాల గ్రామపంచాయతీ పేద బండి రేవు గ్రామంలో మంగళవారం పిరమల్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని పర్ణశాల గ్రామపంచాయతీ సర్పంచ్ వాగే ఖాదర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సేవ సంస్థ అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వివిధ రకాల వ్యాధులకు ఉచితంగా అన్ని రకాల పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వివిధ రకాల వ్యాధులు జ్వరాలు, తదితర అనారోగ్య సమస్యలపై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రజలకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బి పి ఎం కె



వెంకట్, ఎల్ టి టి. సురేష్, కమ్యూనిటీ మొబిలైజర్ బి. కోటేష్, స్టాఫ్ నర్స్ హరిప్రియ,జ్యోతి, మాజీ వార్డు సభ్యులు చింతం సర్వేశ్వరరావు, ఆశ కార్యకర్త కాక. తులసి. గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా సిద్ధి ప్రదీప్ నియామకం

దుమ్ముగూడెం నవంబర్ 3 (మనం న్యూస్):దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పెద్ద నల్లిబల్లి గ్రామానికి చెందిన సిద్ధి ప్రదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని మంగళవారం డీసీసీ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్, రాష్ట్ర వైస్ చైర్మన్ వెంకట నరసయ్య చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, ఎస్సీ వర్గాల సంక్షేమానికి సిద్ధి ప్రదీప్ కట్టుబడి పని చేయాలని రమేష్ సూచించారు.తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన శాసనసభ్యులు తెల్లం వెంకటరావు మాజీ శాసనసభ్యులు పోదేం వీరయ్య కి జిల్లా నాయకత్వానికి, స్థానిక కాంగ్రెస్ నాయకులకు సిద్ధి ప్రదీప్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాయపూడి సుధారాణి పాల్గొన్నారు.



పొదుపంటే ఇదేనా ?

- పగలూ వెలుగుతున్న వీధి దీపాలు
- వారం రోజులుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని గ్రామ పంచాయతీలు











చర్ల,నవంబర్ 3 (మనం న్యూస్) : విద్యుత్ ను పొదుపుగా వాడండి, ఒక యూనిట్ విద్యుత్ ఆదాచేయడమంటే 1.3 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతో సమానమంటూ ఒక పక్క ప్రభుత్వం మరోపక్క విద్యుత్ శాఖ నెత్తీనోరూ కొట్టుకుంటున్నా చర్ల మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్ లు పాలకవర్గాల చెవికెక్కడం లేదు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలోని రిజర్వాయర్లు నిండక తీవ్ర విద్యుత్ సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీలు విద్యుత్ పొదుపు చేయకుండా దుబారా చేస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మండలంలోని లింగాపురం, గొంపల్లి గ్రామ పంచాయతీల నిర్వహణలోని వీధి దీపాలు గత వారం రోజులుగా పగలూ రాత్రి తేడాలేకుండా వెలుగుతున్నాయి. వందల మంది నిత్యం ఈ పరిస్థితిని గమనించి సంబంధిత పంచాయతీలకు తెలియపరిచినా వారిలో ఎటువంటి చలనం లేకపోవడంపై ప్రజలు మండి పడుతున్నారు. రాబోవు విపత్తును గమనించి అవసరం లేని వ్యవసాయ మోటార్లు, లైట్లు, ఫ్యానులు, ఏసిలను నిలుపుదల చేసి విద్యుత్ వృదా కాకుండా చూడాలని ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన లింగాపురంపాడులోని విద్యుత్ సబ్ స్టేషన్ ముందే 24 గంటలు వీధి లైట్లు వెలుగుతుండటం పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖల డొల్లతనం బట్టబయలు చేస్తోంది. సాంకేతిక కారణాల వలన వీధిలైట్లు నిరంతరాయంగా వెలుగుతున్నా యని చెబుతున్న సిబ్బంది ఆ సాంకేతిక కారణాలను పరిష్కరించకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. గ్రామ పంచాయతీ పాలకవర్గం కలుగ చేసుకొని వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కుర్నపల్లిలో బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

చర్ల, నవంబర్ 3 (మనం న్యూస్) : మండలంలోని కుర్నపల్లి గ్రామ పంచాయతీలో బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ నాయకులు కన్నారావు, బాలకృష్ణ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా నియోజకవర్గం ఇన్చార్జి రావులపల్లి రాంప్రసాద్, సీనియర్ నాయకులు మానే రామకృష్ణ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెసిఆర్ పరిపాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశారని గుర్తుచేసారు. దానికి బిన్నంగా కాంగ్రెస్ పార్టీ మోసపూరిత 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేస్తామని గద్దెనెక్కి ఇప్పటికీ 3 సంవత్సరాలు గడుస్తున్నా నేటి వరకు ఒక్క హామీకుడా పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ విదానాల కారణంగా రాష్ట్రం అభివృద్ధి 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. కెసిఆర్ ప్రభుత్వం నిరంతరం రైతులు, గిరిజనుల అభివృద్ధి కోసం కృషి చేసారని గుర్తుచేసారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా, గిరిజనులకు పోడు భూములకు పట్టాలు ఇచ్చి వెంటనే రైతు బంధు ఇచ్చిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. పేద వారికి ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, కెసిఆర్ కిట్, ఇంటింటికీ మంచినీరు ఇలా అనేక పధకాలు అమలుపరిచి ప్రజలకి సహకరించారని గుర్తుచేసారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతతో పరిపాలన జరుగుతోందని, రాబోయే ఎన్నికల్లో కెసిఆర్ ను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేసారు. కుర్నపల్లి యువ నాయకులు కన్నారావు, బాలకృష్ణ లు మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో రెండు పంటలు పండటానికి కారకుడు కెసిఆర్ అని, ఈరోజు తమ ప్రాంతానికి 3 ఫేస్ కరెంట్ ఇచ్చి ఎల్నినినో వంటి విపత్తర పరిస్థితులను కూడా దైయంగా ఎదుర్కొనేలా చేసి ఈ ప్రాంత రైతులను రాజును చేశారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు గొర్ల రాజబాబు, పంజా రాజు, కాకి అనిల్, తడికల బుల్లెబ్బాయి, తుర్రం రాజు, నాగరాజు, కేప గణేష్, కాక నరసింహారావు నక్కరాజు, పార్టీ యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.









మనం చర్ల



చర్ల మేజర్ పంచాయతీ - చర్ల మండలం

అసాంఘిక శక్తులపై నిఘా పెంచండి

- నిబద్ధతతో ప్రజల కోసం పనిచేయాలి
- పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ చేపట్టిన డిఎస్పి



చర్ల, నవంబర్ 3 (మనం న్యూస్) :



అసాంఘీక శక్తులపై నిఘా పెంచడంతో పాటు నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రజా సేవలో బాగస్వాములు కావాలని భద్రాచలం డి ఎస్ పి అరుణ్ కుమార్ ఆదేసించారు. వార్షిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా భద్రాచలం సబ్ డివిజనల్ పోలీస్ అదికారి అరుణ్ కుమార్ మంగళవారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ సాధారణ నిర్వహణ, రికార్డులు, క్రైమ్ రిజిస్టర్లు, కేసు డైరీలు, పెండింగ్ దర్యాప్తు ఫైళ్లతో పాటు ఇతర ముఖ్యమైన రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించి, కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, సకాలంలో పరిష్కరించేందుకు సంబంధిత దర్యాప్తు అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, నిరంతర గస్తీ నిర్వహణ, అసాంఘిక శక్తులపై నిఘా పెంచి ప్రజలతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది క్రమశిక్షణ పాటించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.పోలీస్ సిబ్బంది అంకితభావం, క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యం ప్రజాసేవ పట్ల నిబద్ధతతో విధులు నిర్వహించాలని డి ఎస్ పి సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

5వ తేదీన జిఎస్పి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విజయవంతం చేయండి : పాయం



చర్ల, నవంబర్ 3 (మనం న్యూస్) : ఈ నెల 5 వ తేదీన చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో గోండ్వానా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ వెల్లడించారు. మండలంలోని సుబ్బంపేట పంచాయతీ పరిధిలో గల ఎదిర గుట్టల వద్ద జి ఎస్ పి జిల్లా అధ్యక్షులు బిరబోయిన శేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 5వ తారీఖున చర్ల సి హెచ్ సిలో గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తలపెట్టిన రక్తదాన శిబిరాన్ని అన్ని వర్గాల దాతలు ముందుకు వచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. భద్రాచలం కేంద్రంగా ఎంతో మంది రోగులు రక్తం అందక ప్రాణాలు వదులుతున్నారని, రక్తహీనతతో బాధపడుతూ దుర్భర పరిస్థితిలో జీవనం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ నేపద్యంలో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడేందుకు ఈ రక్తదాన శిబిరం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొంది లీలాప్రసాద్, ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్, ఇర్ప భరత్, ఈసంపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మనం
ఇల్లందు
ఇల్లందు మున్సిపాలిటీ - ఇల్లందు మండలం - టేకులపల్లి - కామేపల్లి

గవర్నర్ కోటలో ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ స్థానాన్ని డాక్టర్ పిడమర్తి రవికి ఎమ్మెల్సీ స్థానాన్ని కల్పించాలి

- ఖాళీ అయ్యే మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి మాదిగలకు ఇవ్వాలి

తెలంగాణ మాదిగ హక్కుల దండోరా టీఎం హెచ్ దళితరత్న కోరిపల్లి శ్రీనివాస్



టేకులపల్లి, నవంబర్ 03(మనం న్యూస్): గవర్నర్ కోటలో ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ పదవిని మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి కి ఇవ్వాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా టీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ దళితరత్న విజ్ఞప్తి చేశారు.డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం లో తన వంతు పాత్ర పోషించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రధాన భూమిక పోషించిన ఉద్యమకారుడు మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పిడమర్తి రవి ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడికి ఈసారి ఎమ్మెల్సీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు ఆ పదవిని పిడమర్తి రవి కి ఎమ్మెల్సీ ఇస్తే మాదిగలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పున్న పరిశీలన చేసి ఈసారి మాదిగలకు ఎమ్మెల్సీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టీఎంహెచ్డీ నాయకులు మునగలేటి వీరస్వామి మాదిగ, బహుజన నాయకులు రాయల శ్రీనివాస్, మంద కుమార్ మాదిగ,రాములు మధు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన వి.పద్మావతి



ఇల్లందు,నవంబర్ 03 (మనం న్యూస్) : ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీకాలం అక్టోబర్ 8వ తేదీతో ముగియడంతో, ఇన్‌చార్జిగా నవంబర్ 2వ తేదీన ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పర్సన్ ఇన్‌చార్జిగా వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ వి.పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు..ఈ విషయాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ అధికారి (డీఎంవో)ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి అలీమ్ తెలిపారు.

ఇల్లందు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- అఖిలభారత ఐక్య రైతు సంఘం



ఇల్లందు, నవంబర్ 03 (మనం న్యూస్) : అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏఐయుకేఎస్, ఇల్లందు మండల కమిటీ సమావేశం మంగళవారం కొమరారంలో సంఘం అధ్యక్షులు కామ్రేడ్ జూకంటి గాంధీ, అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న. డివిజన్ అధ్యక్షులు శ్రీరామ్ కోటన్న. మండల కార్యదర్శి బండారి సత్యం లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లందు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని అరకొరగా పండిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఎరువుల యాప్ ను రద్దు చేయాలని తదితర అంశాలపై ప్రత్యేకమైన తీర్మానాలు చేయడం జరిగింది. ఇల్లందు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5వ తారీఖున ఇల్లందు తాసిల్దార్ కార్యాలయం ముందు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ సమావేశానికి 1, మోడం రాంబాబు 2, గూగుల్ బద్రు 3, అజ్మీర రాంజీ 4, ధరావత్ హరిలాల్ 5, చిత్తలూరి బాలస్వామి 6, కుంజ సమ్మయ్య లు పాల్గొన్నారు..

కరువు సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలి

- విద్యు త్ కోతలు నివారించాలి : కరెంటు ట్రూ ఆఫ్ చార్జీల పెంపును బేషరత్తుగా విరమించుకోవాలి

సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్



ఇల్లందు, నవంబర్ 03 (మనం న్యూస్) : అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్, రాష్ట్ర కార్యదర్శి భానోత్ ఊక్లా ఈరోజు స్థానికమైన ఇల్లందు పట్టణ కేంద్రంలోని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు అశోక్, పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటించి కరువు సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలని సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్ర సీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్, డిమాండ్ చేశారు. దేశంలో వర్షాభావ పరిస్థితులు ఎల్ నినో ప్రభావంతో లక్షలాది ఎకరాలు వరి, పొలాలు, మొక్కజొన్న, పత్తి, తదితర పంటలు ఎండిపోయినవి భూగర్భ జలాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆందోళనలు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా వ్యవసాయంపై అధికంగా ఆధారపడే భారత దేశంలో దీని ప్రభావం కేవలం పంటలకే పరిమితం కాదు. రైతుల ఆదాయం, గ్రామీణ ఉపాధి ఆహార ధరలు, తాగునీటి లభ్యత, విద్యుత్ ఉత్పత్తి దేశ ఆర్థిక వ్యవస్థ పై కూడా తీవ్ర ప్రభావం పడింది. రూ. 50వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కోసం కేంద్రంపై అఖిల పక్షం ద్వారా ఒత్తిడి తీసుకురావాలని ప్రభుత్వానికి సూచించారు. కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. పంట నష్టాలను అంచెనవేసి వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 50. వేలు ఇతర పంటలకు రూ., 30, వేలు రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. 365 మండలాల్లోనే కాదు మిగతా మండలాల్లోనూ, కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. వర్షా బావ పరిస్థితుల వల్ల ప్రాజెక్టులో నీటి మట్టాలు ప్రమాదకర స్థాయిలో పడిపోయారని గుర్తు చేశారు. మరోపక్క భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో సాగు, తాగునీటికి, విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర అటంకాలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బియ్యం ధరలు కేజీ రూ. 100 కి చేరడంతో పాటు నిత్యవసర సరుకుల ధరలు భగ్గు మండుతుండటంతో సామాన్య ప్రజానీకం పై తీవ్ర భారం పడుతుందని పేర్కొన్నారు. తాగునీటి కొరత వల్ల గ్రామీణ ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజా ఆరోగ్యం క్షీణించి అంటూ రోగాలు, బారిన పడే ప్రమాదం ఉందని, ఈ పత్కర పరిస్థితిలో ప్రజలను ఆదుకోవడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అనిగుర్తు చేశారు.రూ. 2 లక్షల లోపు పంట రుణాలు, అన్ని రకాల రుణాలను మాపీ చేయాలనీ, డ్వాక్రా రుణాలపై ఏడాది పాటు వడ్డీ రహిత మార టోరియం ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెల్ల రేషన్ కార్డుదారులకు ఒక వ్యక్తికి 12 కిలోల బియ్యంతో పాటు కరువు ఉపశమన కిట్టు ద్వారా 14 రకాల నిత్యవసర సరుకులను అందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పంటలు వేయలేని స్థితిలో ఉన్న రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులను వెంటనే ప్రారంభించి రోజుకు 700 కూలి ఇవ్వాలి. అభివృద్ధి పనులకు అనుసంధానం చేయాలి. నీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, జిల్లాలో శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలి. చార్జీల రికవరీ అనుమతిని రద్దు చేయాలి చార్జీల పెంపు భారాన్ని బేషరత్తుగాఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు రామ్ చందర్.పడిగా మంగన్న. శివ నాయక్. పుణ్యం సమ్మన్న. ఈసం శ్రీను. రామస్వామి. ప్రజా సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న పాలక ప్రభుత్వాల పై విద్యార్థులు సమరశీల పోరాటాలు చేపట్టాలి

- పిడియస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వి

ఇల్లందు, నవంబర్ 03 (మనం న్యూస్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగంలో తీసుకు వస్తున్న విద్యార్థి వ్యతిరేక సంస్కరణలపై , ప్రభుత్వ విద్యారంగ బలోపేతం, సమానత్వ సమాజ స్థాపన ధ్యేయంగా భవిష్యత్ విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేయాలని పి డి యస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వి అన్నారు. ఇల్లందు డివిజన్ ముఖ్యుల సమావేశం ఇల్లందు పట్టణం చంద కృష్ణమూర్తి ట్రస్ట్ భవన్ లో మంగళవారం జరిగింది.ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా కాషాయీకరించేందుకు విద్యారంగంలో దుర్మార్గ పూరిత సంస్కరణలకుఒ ్రపనుకుంటున్నారని అన్నారు. విద్యారంగాన్ని ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపారమయంగా మార్చి పేద వర్గాలకు విద్య అందకుండా కుట్రపూరిత చర్యలకుపాల్పడ ుతున్నారన్నారని తెలిపారు. దేశంలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి సరిపడానిధులుకేటాయించకుండా, ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయక పోవటంతో నాణ్యమైన పరిశోధనలు జరుగక విశ్వవిద్యాలయాలన్ని సంక్షోభంలోకూరు కుపోతున్నాయని తెలిపారు. మోడీ ప్రభుత్వం బడుల అభివృద్ధిని విస్మరించిగుడులఅబి ,వృద్ధికిపూనూ కుంటున్నదని తీవ్రంగాఆకే ్షపించారు. రాష్ట్రం లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వ వలసిన సుమారుగా పదివేల కోట్ల రూపాయల పెండింగ్స్కాలర్షిప్,ఫీజు,రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకుండా పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ ఉన్నత విద్య భవిష్యత్తును కాలరాస్తున్నారని అన్నారు.రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, ముస్లిం మైనారిటీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యార్థులకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు అనేక మౌలిక సమస్యలతోసతమతవ ుమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ విద్యా సంస్థలు సంక్షేమ హాస్టల్స్ లపై రాష్ట్ర ప్రభుత్వం,ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వలన అనేక సమస్యలు తిష్టవేసాయని అన్నారు.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని, విద్య రంగానికి మంత్రిని కేటాయించాలని, విద్యాసంస్థల బలోపేతానికి కేంద్ర బడ్జెట్ లో 10%, రాష్ట్ర బడ్జెట్లో 30% నిధులు కేటాయించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రిస్తూ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర విద్యార్థి లోకాన్ని సంఘటితం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.ఈ ముఖ్యుల సమావేశంలో పి డి యస్ యూ రాష్ట్ర నాయకులు చాందావత్ శ్రావణ్, పి డి యస్ యూ ఇల్లందు డివిజన్ నాయకులు గంగాధర గణేష్, పి డి యస్ యూ జిల్లా నాయకురాలు శ్రావణి, పి డి యస్ యూ నాయకులు ఆయుష్, లక్ష్మీ నరసింహ, పండు, హేమచంద్ర, నాగచైతన్య, అస్లాం, జస్వంత్, రోహిత్ శ్రావణి పాల్గొన్నారు.



చేపల మార్కెట్ ప్రాంతాన్ని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

- ప్రజలకు పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి : డాక్టర్ తుకారం రాథోడ్

మణుగూరు, నవంబర్ 3(మనంన్యూస్): మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చేపల మార్కెట్ ప్రాంతాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి గ్రామంలో నెలకొన్న పరిస్థితులు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రజలు మిషన్ భగీరథ నీటిని కాచి చల్లార్చిన తర్వాతే తాగాలని, పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ, వ్యాధుల నివారణపై విస్తృత అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు.అనంతరం మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆశా కార్యకర్తల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెలవారీ సమీక్ష నిర్వహించి, రికార్డులు, నివేదికలను పరిశీలించారు. క్షయవ్యాధి, కుష్ఠువ్యాధి, మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధుల గుర్తింపు, నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆశా కార్యకర్తలకు అవసరమైన పరీక్షా పరికరాలు, మందులను నెలవారీగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి మోహన్, సామాజిక ఆరోగ్య అధికారి వీరాస్వామి, ఆరోగ్య పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





విద్యార్థులకు దీపావళి భద్రతా పాఠాలు

- అగ్నిప్రమాదాల నివారణపై ఫైర్ సిబ్బంది సూచనలు
- బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి
- 101, 112 నంబర్లకు అత్యవసర సమాచారం ఇవ్వాలి
- స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి. వినోద్ కుమార్







మణుగూరు, నవంబర్ 3(మనం న్యూస్): రాబోయే దీపావళి పండుగను పురస్కరించుకొని బాణసంచా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మణుగూరు ఫైర్ అవుట్‌పోస్ట్, పినపాక ఫైర్ స్టేషన్ పరిధిలోని వివిధ విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో మణుగూరు ఫైర్ అవుట్‌పోస్ట్, పినపాక ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ (ఎస్ ఎఫ్ ఓ) పి. వినోద్ కుమార్, ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు బాణసంచా కాల్చే సమయంలో పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు.బాణసంచా కాల్చేటప్పుడు తప్పనిసరిగా పెద్దల పర్యవేక్షణ ఉండాలని, బహిరంగ ప్రదేశాల్లోనే కాల్చాలని సూచించారు. శరీరానికి మంటలు అంటుకునే ప్రమాదం తక్కువగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని, ముందస్తు జాగ్రత్తగా నీళ్లు, ఇసుక, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. రాకెట్లను ఖాళీ ప్రదేశాల్లోనే ప్రయోగించాలని, కాలిన బాణసంచా అవశేషాలను నీటిలో తడిపిన తర్వాతే పారవేయాలని సూచించారు.అదేవిధంగా బాణసంచాను చేతిలో పట్టుకొని కాల్చడం, జేబుల్లో పెట్టుకోవడం చేయకూడదని హెచ్చరించారు. వెలగని బాణసంచాను వెంటనే మళ్లీ వెలిగించే ప్రయత్నం చేయరాదని, ఇళ్లలో, వాహనాల సమీపంలో, పెట్రోల్ బంకుల దగ్గర బాణసంచా కాల్చకూడదని స్పష్టం చేశారు. సింథటిక్ దుస్తులు ధరించి బాణసంచా కాల్చడం, మద్యం సేవించి బాణసంచా వినియోగించడం ప్రమాదకరమని వివరించారు. అనుకోని అగ్నిప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే 101 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు ఈ భద్రతా నియమాలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా తెలియజేయాలని కోరారు.దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని ఫైర్ సిబ్బంది ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

మానవత్వం చాటుకున్న శంబునిగూడెం సర్పంచ్ సుమలత

గుండాల,నవంబర్ 03 (మనం న్యూస్):



గుండాల మండలం శంబుని గూడెం గ్రామపంచాయతీ పరిధిలో శంబుని గూడెం కుంజ దాసు ఇటీవల అనారోగ్యంతో మరణించగా అతని దశ దిన కర్మలకు సర్పంచ్ ఈసం సుమలత, రాజబాబు ఎనిమిది వేల విలువగల అరకింట బియ్యం నూనె డబ్బా అతని కుటుంబానికి అందించి మానవత్వం చాటుకున్నాడు. చెంబుని గూడెం గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు జరిగిన ముందుంటూ మానవత్వం చాటుతున్నాడు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈసం సుమలత,ఈసం రాజబాబు, ఉపసర్పంచ్ వట్టం కృష్ణయ్య,వార్డు సభ్యులు ఈర్ప శివకృష్ణ,ఈసం యమున,చాట్ల బుచ్చయ్య,వార్డు సభ్యులు కుంజ సమ్మయ్య,కుంజ శేఖర్,కుంజ హరినాథ్,కుంజ విజయ్,కుంజ జనార్ధన్,కోర్స స్వామి తదితరులు పాల్గొన్నారు.

మనం
మనం కోసం లక్ష్మర యుష్మం.



మణుగూరు

మణుగూరు మున్సిపాలిటీ - మణుగూరు మండలం - అశ్వాపురం - బూర్గంపాడు

ఉపాధి హామీ మేట్‌లకు శిక్షణ



అశ్వాపురం, నవంబర్ 3 (మనం న్యూస్): వీ బీ జీ రామ్ జీ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మేట్ లకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని రైతువేదికలో ఎంపీడీఓ ముత్యాలరావు ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులను సమర్థవంతంగా నిర్వహించే విధానం, కూలీల హాజరు నమోదు, పని ప్రదేశాలలో పాటించాల్సిన నిబంధనలు, పని కొలతలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధి పనులకు వచ్చే ప్రతి కూలీకి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పని కల్పించాలని సూచించారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మేట్ లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. పనుల్లో పారదర్శకత పాటిస్తూ, నాణ్యతతో కూడిన పనులు జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

పోడు జోలికొస్తే పోరాటం తప్పదు

- మూల ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి
- ఆదివాసి రక్షణ సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్దం నందా



చర్ల, నవంబర్ 3 (మనం న్యూస్) : పోడుభూముల జోలికి వస్తే చూస్తూ ఊరుకునేదిలేదని, పోరాటాల ద్వారా గట్టిగా ఆదివాసీ రక్షణ సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్దం నందా హెచ్చరించారు. మండలంలోని ఆదివాసి రక్షణ సంఘం నాయకత్వం పలు లోతట్టు అటవీ గ్రామాలయిన కొండేవాయి, కొర్కుటపాడు, రాళ్ళాపురం గ్రామాలలో పర్యటించారు. ఈ పర్యటనలో ఆదివాసి రక్షణ సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్దం నంద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మూల ఆదివాసులకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. మూల ఆదివాసులను గిరిజనులు కాదు అని అంటూ కుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిలిపివేసి భావితరాల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. బ్రతుకుతెరువు అయిన పోడు భూమిని ఆదివాసీల నుండి లాక్కోవాలని చూడడం, ఇక్కడి నుండి వెళ్లగొట్టాలని ప్రయత్నించడం మానుకోవాలని హితవుపలికారు. అటవీ అధికారులు ఆదివాసీల పట్ల వారి పోడు భూముల పట్ల దురుసుగా వ్యవహరించే పద్ధతిని మానుకోవాలని కోరారు. లేకపోతే పోరాటం తప్పదని తెలిపారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ఆదివాసి రక్షణ సంఘం నిరంతరం ప్రజాస్వామ్య బద్దంగా ఉద్యమిస్తుందని తెలిపారు. మనకోసం జరిగే ఈ ఉద్యమంలో ప్రతి ఒక్క ఆదివాసి బిడ్డ తప్పకుండా పాల్గొనాలని, ఐకమత్యంతో సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే దిశగా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భరత్, ఇడిమి, కోసి తదితరులు పాల్గొన్నారు.

మనం
పినపాక
మణుగూరు - అశ్వాపురం - పినపాక - కరకగూడెం - ఆళ్లపల్లి - గుండాల- బూర్గంపాడు

జ్ఞానేశ్వరావు రాజీనామ చేయ్యాలి

- బిఎస్పి నాయకులు బొమ్మెర రాంబాబు డిమాండ్



గుండాల,నవంబర్ 03(మనం న్యూస్): కేంద్ర ప్రభుత్వం చేతిలో చెంచేగా మారి ఈవీఎం ల ద్వార ట్యాంపరింగ్ చేయ్యడమే కాకుండ సర్ పేరుతో ఓట్ల చోరికి పాల్పడ్డ జాతీయ ఏన్నీకల కమీషన్ జ్ఞానేశ్వరావు రాజీనామ చేయ్యాలని బహుజన్ సమాజ్ పార్టీ బి ఎస్ పి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి బొమ్మెర రాంబాబు డిమాండ్ చేశారు.ఈ దేశానికి స్వతంత్ర్యం వచ్చి 80 ఏండ్లు ఐన కూడ మన దేశ ప్రజలకు ఉచిత విద్య, ఆరోగ్యం ఉపాది తో పాటు ఆర్థిక అభివృద్ధి రంగాలల్లో మన దేశం వేనుక బాటుకు గల యూపీఏ,ఎన్ డి ఏ ప్రభుత్వలే ప్రదాన కారణం అని ఆరోపించారు. కాంగ్రెస్ బీజేపి పార్టీలకు దేశ సంపదను లూటి చేయ్యడం కోసం కుర్చి ఆరాటమే తప్ప.పేద ప్రజల అబీవృద్ధి పట్ల ఆరాటం లేదని ఎద్దవ చేశారు.ఈదేశంలో ప్రజస్వామ్యంన్ని రక్షించే రాజకీయ పార్టీలు ఏకమై తెలంగాణ రాష్టంలో భవిష్యత్తులో జరిగే ఏన్నీకల్లో యూపీఏ ఎన్ డి ఏ పార్టీలను ఓడించి దేశాన్ని తెలంగాణలో బహుజన కులాలు పాలకులుగ మారి సకల సమస్యలు పరిష్కారించుకోవాలని సంబ్బడ్ద కులాల ప్రజలకు పిలుపునిచ్చారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమం

పినపాక, నవంబర్ 3(మనం న్యూస్) : పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియ మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నమోదు చేయించే కార్యక్రమాన్ని పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు, భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు గోడిశాల రామనాధం, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు తోలెం కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించారు.మండల పరిధిలోని తోగ్గూడెం, పినపాక తదితర ఏజెన్సీ గ్రామీణ పంచాయతీలలో కాంగ్రెస్ నాయకులు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులను సమాయత్తం చేస్తూ నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. అర్హత కలిగిన విద్యావంతులను, యువతను అభినందిస్తూ ఓటు హక్కు ప్రాముఖ్యత వివరించి దరఖాస్తులు చేయించేందుకు కృషి చేశారు. అలాగే మండలంలోని పలు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలలను సందర్శించి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపక బృందాలతో సంభాషణలు జరిపారు.

- సర్వోత్తమ రెడ్డి గెలుపునకు కృషి చేయాలి :పేరం వెంకటేశ్వర్లు.

కాంగ్రెస్ పార్టీ అధికారికంగా బలపరిచిన పట్టభద్రుల అభ్యర్థి సర్వోత్తమ రెడ్డి ప్రజాసేవకుడని వారి విజయ సాధనకై ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు కోరారు. పోరాట పటిమ కలిగిన వ్యక్తిని శాసనమండలికి పంపడం ద్వారా విద్యావంతుల గొంతుకను చట్టసభలలో వినబడేలా చేయవచ్చని ఆకాంక్షించారు. సర్వోత్తమ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి విజయాన్ని చేకూర్చాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పట్టభద్రుడిపై ఉందని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా దిశ కమిటీ సభ్యులు మద్దెల సమ్మయ్య, స్థానిక సర్పంచ్‌లు పూనెం వెంకటేశ్వర్లు, అరిగెల అలివేలు, మట్టా బాబురావు, వాగబోయిన చంద్రరావు, ఉపసర్పంచ్‌లు అచ్చా నవీన్, కొడం రామ్మోహన్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చిట్టిమల్ల ప్రసాద్, ఆత్మ కమిటీ ప్రతినిధి చిట్టిమల్ల సతీష్ , వార్డు సభ్యులు జాన్ బాబు, కోరం భూషణం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు స్వతంత్ర రెడ్డి, డొంకెన సాంబశివరావు, కొంపెల్లి మల్లేష్, బండారు గిరి ప్రసాద్, పాయం రామయ్య, కొమరం నగేష్, శ్రీను, సల్లూరి లక్ష్మయ్య, అనిపెద్ది వినోద్, రేగళ్ల జగన్, అనిల్, కృష్ణ, రాజేష్, నవీన్,లతో పాటు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు..

- కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన.. డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్







కరకగూడెం,నవంబర్ 3(మనం న్యూస్): ప్రభుత్వ వైద్యశాలల్లో విధుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) తుకారం రాథోడ్ హెచ్చరించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వహణ, సిబ్బంది హాజరు, రక్త పరీక్షలు, మందుల లభ్యత, వైద్య రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న చికిత్స వివరాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. రోగుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ వారికి అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని ఆదేశించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత విస్తరించాలని, గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణను ముమ్మరం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జ్వరాలు, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల లక్షణాలపై ప్రజలకు వివరించి, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలని సూచించారు.గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, దోమల నివారణ, తాగునీటి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలు మారుమూల గ్రామాల ప్రజలకు సైతం అందేలా వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవితేజ, ఆరోగ్య విస్తరణ అధికారి కృష్ణయ్య, నరసింహారావు, రక్త పరీక్షల సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు క్షేత్రస్థాయిలో పనిచేయాలి : డీఎంహెచ్ఓ

- అనుమానితులను గుర్తించడంలో ఆశా కార్యకర్తలదే కీలక పాత్ర
- బాధితులకు సకాలంలో పరీక్షలు, పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలి

పినపాక, నవంబర్ 3(మనం న్యూస్) : క్షయ వ్యాధి నిర్మూలనకు ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ సూచించారు. మంగళవారం పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. క్షయ వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి సరైన సమయంలో పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందేలా కృషి చేయాలని సూచించారు.క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశం ఉన్నందున ఆశా కార్యకర్తలు గ్రామాల్లోని ప్రతి ఇంటిని సందర్శించి అనుమానిత లక్షణాలు ఉన్నవారిని సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకువచ్చి కఫ పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించేలా చూడాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు అందేలా పర్యవేక్షించాలన్నారు. సాధారణ ప్రసవాల సమయంలో నవజాత శిశువులకు అందించాల్సిన వైద్య సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశా కార్యకర్తలకు వివరించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు సంపూర్ణ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల వైద్య సేవలు అందించే కేంద్రం కావడంతో వైద్యాధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి మోహన్, సామాజిక ఆరోగ్య అధికారి సత్యావతి, నేత్ర వైద్య అధికారి జి. సంజీవరావు, ప్రజారోగ్య నర్సు దేవమ్మ, సహాయక నర్సులు, ఆరోగ్య సహాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



బంగారు పతకం సాధించిన పినపాక విద్యార్థిని

పినపాక, నవంబర్ 3(మనం న్యూస్) : చదువులో ప్రతిభకు పట్టుదల తోడైతే విజయాలు సొంతమవుతాయని పినపాక మండలానికి చెందిన ఎ.స్నేహిత నిరూపించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ప్రదానం చేసిన బంగారు పతకాన్ని అందుకొని మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, ఏడూళ్ల బయ్యారం గ్రామానికి చెందిన ఎ.స్నేహిత (తండ్రి వెంకటేశ్వర్లు) పాల్వంచలోని కేఎల్ఆర్ ఫార్మసీ కళాశాలలో 2021--2024 విద్యా సంవత్సరానికి సంబంధించిన బ్యాచ్‌లో ఫార్మసీ విద్యను అభ్యసించారు. చదువులో సాధించిన ఉత్తమ ఫలితాలకు గుర్తింపుగా కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి బంగారు పతకాన్ని అందుకున్నారు .గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని ఉన్నత విద్యలో తన ప్రతిభను చాటుతూ విశ్వవిద్యాలయ స్థాయిలో బంగారు పతకం సాధించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్నేహిత సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు, స్థానికులు స్నేహితను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



డిసెంబర్ 15 నుండి ఆశా వర్కర్స్ నిరవధిక సమ్మె

- సమ్మె నోటీస్ ఇచ్చిన సిఐటియు కన్వీనర్ హైమ



టేకులపల్లి, నవంబర్ 03(మనం న్యూస్): ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం,కాంగ్రెస్ పార్టీ ఆశా వర్కర్ల కు మేనిఫెస్టో వాగ్దానం అమలు చేయక పోవడం పై సిఐటీయు ఇతర సంఘాలతో డిసెంబర్ 15నుండి నిరవధిక సమ్మె,సమ్మె నోటీసు ఇచ్చిన సీఐటీయు నాయకులు స్థానిక సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆశా వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ సాధన కోసం డిసెంబర్ 15 తేదీనుండి నిరవధిక సమ్మె తలపెట్టినట్లు సమ్మె నోటీసు ను అధికారులకు వినతి పత్రం రూపం లో అందించారు.గత 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు సమ్మె చేసిన నేపధ్యంలో ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సిఐటీయు రాష్ట్ర నాయకత్వం తో ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్చలు జరిపి ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ తో కూడిన కమిటీని వేస్తామని హామీ ఇచ్చింది. సమ్మె శిబిరాలలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నేతలు నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సహా మంత్రులు, ఎమ్మెల్యే లు తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తారని తమ మ్యానిఫెస్టోలో ఆషా లకు 18వేల ఫిక్సు వేతనం ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని దాని కారణంగా నే డిసెంబర్ 15నుండి ఇతర సంఘాలతో నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించి నట్లు సీఐటీయూ టేకులపల్లి కన్వీనర్ హైమ తెలిపారు. డిమాండ్ ఆశాలకు 18 వేతనం నిర్ణయించాలి ఉద్యోగ భద్రత కల్పించాలి 50 లక్షల ఇన్సూరెన్స్ మరణించిన ఆశలకు మట్టి ఖర్చులకు 50,000 రిటైర్మెంట్ బెనిఫిట్ అయిదు లక్షలు పారితోషికంలో సగం పెన్షన్ గా నిర్ణయించాలని ప్రతి ఆదివారం పండుగలకు సంవత్సరానికి 20 రోజుల క్యాజువల్, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలని ప్రసూతి సెలవులు కూడా ఇవ్వాలని ఏఎన్ఎం, జీఎన్ఎం ట్రైనింగ్ చేసిన ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని రెండో పీయార్సీలో ఆశ వర్కర్లకు 30 వేల కనీస వేతనం నిర్ణయించాలని ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన రెండు డిఏలు అషాలకు వర్తింపజేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అనిన్నటిని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చీమల రమణ, మల్లేశ్వరి, లక్ష్మి,ఉమాదేవి, సుశీల, ఆదిలక్ష్మి,హైమా, మజారి,సరితా తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరగలేదు.....

- నిధుల వినియోగంపై అధికారుల స్పష్టత



భద్రాచలం, నవంబర్ 3 (మనం న్యూస్): భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ వస్తున్న వార్తలను, ఆరోపణలను పంచాయతీ ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. సమాచార హక్కు చట్టం కింద తీసుకున్న వివరాలను కొందరు వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఈఓ మాట్లాడుతూ పంచాయతీ నిధుల వివరాలను వివరించారు.?ఎన్నికల నిర్వహణ ఖర్చులు...పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రూ. 9,72,865 ఖర్చు కాగా, ఆ సమయంలో ప్రభుత్వం వద్ద ఖజానా నిధులు అందుబాటులో లేకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ సాధారణ నిధుల నుంచి అడ్వాన్స్ రూపంలో వినియోగించారు. అనంతరం ప్రభుత్వం నుండి గ్రాంట్ విడుదల కాగానే, తీర్మానం నంబర్ 54 ప్రకారం ఆ మొత్తాన్ని తిరిగి పంచాయతీ ఖాతాలో జమ చేయడం జరిగింది.

శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాల ఖర్చులు...

ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అప్పటి ప్రత్యేక అధికారి ఆమోదించిన తీర్మానం ప్రకారం కలెక్టరేట్ గైడ్‌లైన్స్ మేరకే నిధులు వెచ్చించబడ్డాయి. అత్యవసర పనులకు సంబంధించి ఖర్చు చేసిన మొత్తాన్ని కూడా గ్రామ పంచాయతీ తీర్మానం (నంబర్ 12) ప్రకారం సీనియర్ అసిస్టెంట్ ద్వారా డ్రా చేసి, పూర్తి వివరాలతో తిరిగి పంచాయతీ చలానా ద్వారా చెల్లించడం జరిగింది. ప్రభుత్వ నిబంధనలు, జిల్లాకలెక్టర్ ఆదేశాలు, గ్రామ పంచాయతీ తీర్మానాల ప్రకారమే ప్రతి పైసా ఖర్చు చేయడం జరిగిందని, ఇందులో ఎలాంటి ఆర్థిక అవకతవకలు జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. వాస్తవాలను తెలుసుకోకుండా నిరాధారమైన ఆరోపణలు చేయవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

సింగరేణిలో గైర్హాజరు కారణంగా తొలగింపునకు గురైన వారి కేసుల పునఃపరిశీలనకు దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ

ఇల్లందు, నవంబర్ 03 (మనం న్యూస్) :

ఇల్లందు సింగరేణి జిఎం కార్యాలయం నుండి మంగళవారం విడుదల చేసిన ప్రకటన సింగరేణి భవన్, నవంబర్ 03, 2026 సింగరేణి సంస్థలో 2023 నుంచి 2025 మధ్య కాలంలో విధులకు గైర్హాజరు కారణంగా తొలగించబడిన మాజీ ఉద్యోగుల కేసులను పునఃపరిశీలించాలని యాజమాన్యం నిర్ణయించింది. మళ్లీ ఉద్యోగంలోకి తీసుకునేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది. 01.01.2023 నుంచి 31.12.2025 మధ్య కాలంలో గైర్హాజరు కారణంగా తొలగించబడిన వారు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. 01.04.2026 నాటికి 46 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయస్సు కలిగి ఉండాలని పేర్కొంది. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కోల్ బెల్ట్ ప్రాంత ప్రజా ప్రతినిధులతో సమావేశం సందర్భంగా డిస్మిస్డ్ ఉద్యోగులకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరిన నేపథ్యంలో ఈ అంశాన్ని పరిశీలించాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో 2023 నుంచి 2025 మధ్య కాలంలో గైర్హాజరు కారణంగా డిస్మిస్ అయిన ఉద్యోగులకు అవకాశంకల్పిస్తూయాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇవీ అర్హతలు.... తొలగించబడిన కాలానికి ముందున్న గత 05 క్యాలెండర్ సంవత్సరాలలో ఏదైనా 2 సంవత్సరాలలో కనీసం 100 మస్టర్లు పూర్తి చేసి ఉండాలి. జనరల్ అసిస్టెంట్ ట్రైనీ (యు జి) కేటగిరీ–× పోస్టులో పునఃనియామకం కోసం వైద్యపరంగా ఫిట్‌గా ఉండాలి. అ ర్హత కలిగి, ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలనుకునే డిస్మిస్డ్ ఉద్యోగులు తగిన ప్రొఫార్మాలో దరఖాస్తును పూర్తి చేసి, తాము చివరగా పనిచేసిన గని / డిపార్ట్‌మెంట్ అధిపతికి సమర్పించాలి. దరఖాస్తు సమర్పించడానికి చివరి తేదీ 14.11.2026గా సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఏరియా జనరల్ మేనేజర్లు అర్హత కలిగిన అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి, తదుపరి చర్యల నిమిత్తం నిర్దిష్ట తేదీలోగా సంబంధిత అధికారులకు పంపించాలని కోరింది. పూర్తి వివరాల కోసం సంబంధిత గనులు లేదా శాఖల అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

ఆశా వర్కర్లు సమ్మెబాట

- వైద్యాధికారులకు సమ్మె నోటీసులు అందజేత.
- ఆశా కార్యకర్తలకు కనీస ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000 లు చెల్లించాలి.
- సిఐటియు జిల్లా కోశాధికారి జి.పద్మ డిమాండ్



దుమ్ముగూడెం నవంబర్ 3 (మనం న్యూస్):

ఆశ వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం 18000 అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు నిరవధిక సమ్మె లోకి వెళ్తున్నట్టు తెలియజేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ములకలపాడు, నర్సాపురం, పాఠశాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు మంగళవారం సమ్మె నోటీసులు అందజేశారు. జిల్లా కోశాధికారి జి పద్మ తెలిపారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి జిలుకర పద్మ మాట్లాడుతూ.. రోజురోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నప్పటికీ, అందుకు అనుగుణంగా ఆశా కార్యకర్తల వేతనాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారితోషకం పేరుతో ప్రభుత్వం ఆశా కార్యకర్తల శ్రమను దోపిడీ చేస్తోందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద, బడుగు, బలహీన వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆశా కార్యకర్తలు రాత్రింబవళ్లు కష్టపడుతున్నప్పటికీ ప్రభుత్వాలు వారి సేవలను గుర్తించకపోవడం అన్యాయం అన్నారు. ఆశా కార్యకర్తల సేవలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి కనీస వేతనం అమలు చేయడానికి ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, రూ.18 వేల కనీస ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని 50 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని మట్టి ఖర్చులు 50 వేలు ఇవ్వాలని రిటైర్డ్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ఆ రిటైర్మెంట్ గా ప్రతినెల వస్తున్న జీవితంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా జిల్లా కమిటీ సభ్యులు నర్సు, శిరోమణి, సుజాత, చిన్నక్క సుభద్ర, లక్ష్మి,భద్రమ్మ, రేణుక, సరస్వతి, జానకి కమల, అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సమితి (డి) పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బూసిరెడ్డి



భద్రాచలం, నవంబర్ 3(మనం న్యూస్):తెలంగాణ రక్షణ సమితి (డి) పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బూసిరెడ్డిఎన్నికల ప్రణాళిక సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ నియామక పత్రాలను జారీ చేశారు.పార్టీ బలోపేతంలో భాగంగా విస్తృత ప్రజాదరణ కలిగిన సీనియర్ నాయకుడు, పేదల సంక్షేమానికి పాటుపడే సేవాతత్పరుడు డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించినట్లు సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు బలమైన సంబంధాలు ఉన్నాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ సేవారంగ గవర్నర్‌గా విశిష్ట సేవలందించిన అనుభవం ఆయన సొంతం. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉంటూ, జాతీయ కాంగ్రెస్ పక్షాన సుదీర్ఘకాలం పాటు ఆయన సేవలందించారు.రానున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో డాక్టర్ శంకర్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటుతో విజయం సాధించి శాసనమండలిలో అడుగుపెట్టడం ఖాయమని పార్టీ ధీమా వ్యక్తం చేసింది. ఈ అభ్యర్థిత్వానికి ప్రజా సంఘాలు, అధ్యాపక సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, న్యాయవాదుల సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.?ప్రజలకు, పార్టీ శ్రేణులకు నిరంతరం అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పార్టీ నియమ నిబంధనలకు లోబడి పనిచేస్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకత్వం పిలుపునిచ్చింది.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



- రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి
- డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె
- ఆశా వర్కర్ల జేఏసీ సమ్మె నోటీసు

తిరుమలాయపాలెం, నవంబర్ 3 (మనం న్యూస్) : ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్ల జేఏసీ సమ్మె నోటీసు జారీ చేసింది. డిమాండ్లు పరిష్కరించకపోతే 2026 డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం సుబ్లేడ్ పీహెచ్‌సీలో డాక్టర్ వసుంధరకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు వసపంగు వీరన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 ఏళ్లుగా చాలీచాలని పారితోషికాలతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించడంతో పాటు సీజనల్ వ్యాధులు, అంటువ్యాధుల నియంత్రణ, కరోనా సమయంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ రకాల వైద్య సేవలు, సర్వేలు, టార్గెట్లు, పల్స్ పోలియో, లెప్రసీ, డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ వారికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేదని విమర్శించారు. ప్రస్తుతం నెలకు కేవలం రూ.9,900 మాత్రమే పారితోషికం అందుతోందని, ఐదేళ్లుగా పారితోషికాలు పెరగలేదని పేర్కొన్నారు. 2023 సెప్టెంబర్‌లో 15 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేసిన సందర్భంగా ప్రభుత్వం ఆశాల సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల మేనిఫెస్టోలో వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. 2024లో పలుమార్లు ఉన్నతాధికారులతో జరిగిన చర్చల్లో రూ.50 లక్షల బీమా, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు, ప్రమోషన్లు కల్పిస్తామని, రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం కోసం ఫైల్ ప్రాసెస్‌లో ఉందని తెలిపినా ఇప్పటివరకు అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకుంటే పారిశ్రామిక వివాదాల చట్టం-1947 ప్రకారం నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మోటమర్రి నాగేంద్ర, కూరపాటి లత, దోమల సత్యవతి, సైదమ్మ, సరిత, నాగలక్ష్మి, నీల, అరుణ, సుజాత, మంగమ్మ, ఉమ, జ్యోతి, కవిత, సుకన్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అమరుడు శ్రీపాదశ్రీహరి ఆశయాలను కొనసాగిస్తాం



- దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఉద్యమించాలి
- పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి గోకినపల్లి మస్తాన్

తిరుమలాయపాలెం నవంబర్ 3 (మనం న్యూస్) : విప్లవ యోధుడు అమరుడు శ్రీపాదశ్రీహరి వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన స్థూపం వద్ద జెండా ఆవిష్కరించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, యువతతో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శులు గోకినపల్లి మస్తాన్, వంగూరి వెంకటేష్ మాట్లాడుతూ.. శ్రీపాదశ్రీహరి త్యాగం ప్రజా పోరాటాల చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. నేటికీ సమాజంలో కొనసాగుతున్న దోపిడీ, పేదరికం, నిరుద్యోగం, విద్యారంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అమరవీరుల ఆశయాలను ఆచరణలో కొనసాగించడమే వారికి నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీడీఎస్‌యూ నాయకులు మందుల రాజేందర్ ప్రసాద్, గొర్రపాటి రమేష్, జిల్లా నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమరుడు శ్రీపాద శ్రీహరికి న్యూడెమోక్రసీ ఘన నివాళి

అమరవీరుల ఆశయ సాధన కోసం నిరంతరం పోరాడుతాం



తిరుమలాయపాలెం, నవంబర్ 3 (మనం న్యూస్) : తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామంలో అమరుడు శ్రీపాద శ్రీహరికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ నాయకులు మందుల రాజేంద్రప్రసాద్, మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ మాట్లాడుతూ.. 1976 ఎమర్జెన్సీ కాలంలో విప్లవోద్యమంలో కీలక పాత్ర పోషించిన శ్రీపాద శ్రీహరిని నాటి ప్రభుత్వం నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేసి హతమార్చిందని పేర్కొన్నారు. సమసమాజ స్థాపన, పేద ప్రజల విముక్తి కోసం ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. 50 ఏళ్లు గడిచినా అమరవీరుల ఆశయాల సాధన కోసం ఎర్రజెండా నాయకత్వంలో ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తున్నామని, వారి త్యాగాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కిషన్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు మస్తాన్, వంగూరి వెంకటేష్, గ్రామ కార్యదర్శి ఈడబోయిన మల్లయ్య, జగన్, పేర్ల మల్సూర్, రామయ్య, నందిపాటి వెంకన్న, గొర్రెపాటి రాంబాబు, పుల్లయ్య, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

అమరుడు శ్రీపాదశ్రీహరికి పీడీఎస్‌యూ నాయకుల నివాళులు

విద్యార్థి అమరుల ఆశయ సాధనకు ఉద్యమించాలి : పీడీఎస్‌యూ నేతలు



తిరుమలాయపాలెం నవంబర్ 3 (మనం న్యూస్): అంతరాలు లేని సమసమాజం, విద్యార్థుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర నేత శ్రీపాదశ్రీహరి నేటి విద్యార్థులకు ఆదర్శప్రాయుడని పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తిప్పారపు లక్ష్మణ్, యాక్టింగ్ కార్యదర్శి తిమ్మిడి రఘుబాబు అన్నారు. మంగళవారం రాజారం గ్రామంలో జిల్లా నాయకుడు స్టాలిన్ అధ్యక్షతన శ్రీపాదశ్రీహరి, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి పోట్ల రామనర్సయ్యకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 50 ఏళ్ల గడిచినా ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని, ప్రైవేటీకరణతో పేదలకు విద్య, వైద్యం దూరమవుతున్నాయని, నిరుద్యోగం పెరుగుతోందని అన్నారు. విద్యార్థులు, యువత అమరవీరుల స్ఫూర్తితో శాస్త్రీయ విద్య, హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు, కార్యకర్తలతో పాటు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు పాల్గొన్నారు.

మీ ప్రతిభకు మెరుగులు దిద్దండి

జిల్లా ఉపాధి కల్పనాధికారిణి ఎన్.మాధవి



ఖమ్మం, నవంబర్ 3 (మనం న్యూస్) : ప్రతి విద్యార్థిలో అంతర్లీనంగా ఉండే ప్రతిభా పాటవాలకు మెరుగులు దిద్దుకున్నపుడు జీవితంలో అత్యున్నత శిఖరాలకు చేరుకో వచ్చని ఖమ్మం జిల్లా ఉపాధికల్పనాధికారిణి ఎన్.మాధవి అన్నారు. మంగళవారం నాడు ఎస్ ఆర్ బిజి ఎన్ఆర్ కళాశాలలో ఇటీవల రాష్ట్ర స్థాయి లో జిజ్ఞాస విద్యార్థి కేంద్రక పోటీలో గణితం విభాగం లోరాష్ట్ర ప్రథమ బహుమతి పొందిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.అనంతరం సందేశాన్నిస్తూ క్రమశిక్షణ ఏకాగ్రత పుస్తక అధ్యయనం, తల్లి తండ్రులు గురువులు చూపించే సన్మార్గంలో నడవాలని సూచిం చారు. పరిశోధనల పట్ల జిజ్ఞాస కలిగి ఉండాలని సూచించారు. సానుకూల ధృక్ప థంతో ముందుకు సాగాలని తెలిపారు. తెలంగాణ విద్యా కమీషనరేట్ ఉత్తర్వులతో జిల్లా కేంద్రాలలో ఉన్న కళాశాలల్లోనే బహు మతులను అందజేస్తున్న క్రమంలో మన కళాశాలలో అందజేస్తున్నట్లు కళాశాల జిజ్ఞాస కోఆర్డినేటర్ డా.ఎం.పిచ్చయ్య నివే దికను సమర్పించారు. అనంతరం ముప్పై వేల రూపాయల నగదు బహుమతి చెక్ ను విద్యార్థులకు ప్రదానం చేశారు. కార్యక్ర మంలో వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి, ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, ఎగ్జామ్స్ కంట్రోలర్ డా.ఏ.ఆర్ సత్యవతి, ప్రాజెక్టు సూపర్వైజర్ కనకదుర్గ, గణిత విభాగాధిపతి పల్లా శ్రీనివాస్ జిజ్ఞాస కమిటీ సభ్యులు డా.బి.శ్రీనివాస్, బంగారి, డా.శ్రీనివాసశరీన్ వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



అమరవీరుల ఆశయ పూతోటలో పయనిద్దాం

– సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి ధర్మపురి వీర బ్రహ్మచారి, జరుపుల సుందర్

టేకులపల్లి, నవంబర్ 03(మనం న్యూస్): టేకులపల్లి బస్ స్టాండ్ సెంటర్ లో కాచనపల్లి అమరవీరుల స్థూపం వద్ద అమరులను తలుచుకుంటూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి ధర్మపురి వీర బ్రహ్మచారి జండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం,భుక్తి కోసం,ఈ దేశ విముక్తి కోసం,అమరవీరులు త్యాగం చేశారని,బూటకపు ఎన్కౌంటర్ ద్వారా, అనారోగ్యంతో,మాఫియా మూట చేతులలో ఎంతోమంది అమరులయ్యారని. వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని. ఈనెల తొమ్మిదో తారీఖు వరకు అమరవీరుల స్మారక సభలు జరపాలని. పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల నాయకులు జరుపుల సుందర్,బి పంతులు,జి మదర్, సుడిగాలి వెంకన్న, బి లింగ, అరుణోదయ రాష్ట్ర నాయకులు కొండలరావు,ప్రజా సంఘాల నాయకులు ఉపేందర్, రమేష్,నవీన్, లింగ,లచ్చు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లులు త్వరగా విడుదల చేయాలి

రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ గౌతమ్‌ని కలిసిన ఎమ్మెల్యే



దమ్మపేట, నవంబర్ 03(మనం న్యూస్) : అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ గౌతమ్‌ని వారి ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై చర్చించారు. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ఫైనల్ బిల్లులు త్వరగా విడుదల చేయాలని కోరారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పెండింగ్ బిల్లుల చెల్లింపులు తదితర అంశాలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి అర్హులైన పేదలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీపీఎం మండల కార్యదర్శిని పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు

తిరుమలాయపాలెం, నవంబర్ 3 (మనం న్యూస్) : ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తిరుమలాయపాలెం సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శీనును బీఆర్ఎస్ నేతలు పరామర్శించారు. మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తీసుకుంటున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా సేవలోకి రావాలని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా అందరినీ పరామర్శించడం బీఆర్ఎస్ నేతల గొప్ప మనసును చాటుతుందని స్థానికులు అన్నారు. ఈ కార్యక్రమంలో హస్నాబాద్ గ్రామ సర్పంచ్ భర్త మండల నాయకులు కొవ్వూరు పద్మ సత్తిరెడ్డి, మేడిదపల్లి గ్రామ మాజీ సర్పంచ్ భర్త బండ్ల సురేష్ , మోటపూతల శ్రీను, లచ్చిరెడ్డి, సతీష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



బీటీ రోడ్డు నిర్మాణానికి నోచుకోని గడ్డోరిగట్ట రోడ్లు

– పదేళ్లగా రోడ్లు కోసం గ్రామస్తులు ఎదురుచూపులు
– బురదమయమైన రోడ్లతో పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులకు, రైతులకు తీరని తిప్పలు
– ఎమ్మెల్యే స్వగ్రామానికి కూతవేటు దూరంలోనే గడ్డోరిగట్ట రోడ్డు
– నిధులు విడుదల చేసి రోడ్డు నిర్మించాలి: సర్పంచ్ మడకం.జోగయ్య





దుమ్ముగూడెం నవంబర్ 3 (మనం న్యూస్): పల్లెల్లో గ్రామాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని పాలకులు పదే పదే చెబుతున్నా అభివృద్ధికి నోచుకోని అనేక పల్లెలు, గ్రామాలు అనేక సమస్యలతో సుతమతం అవుతూనే ఉన్నాయి. ఎన్నికల జరిగినప్పుడల్లా మేము అధికారంలోకి రావడమే ఆలస్యం మీ గ్రామ స్వరూపాలే మారిపోతాయి అంటూ రాజకీయ నాయకులు నమ్మించడం ప్రజలు నమ్మి ఓట్లు వేయడం గెలిచిన ప్రజాప్రతినిధులు ముఖం చాటు వేయడం గ్రామాలలో తరచూ జరుగుతున్న తతంగం ఇదే. దుమ్ముగూడెం మండలం చిన్న బండి గ్రామపంచాయతీ లో పూర్తి ఆదివాసీ గ్రామమైన గడ్డో రిగట్ట గ్రామాన్ని అనేక సంవత్సరాలుగా రోడ్డు సమస్య పట్టిపీడిస్తుంది. చిన్న బండి రేవు గ్రామం నుండి గడ్డోరిగట్ట గ్రామం వరకు, గడ్డోరిగట్ట నుండి కాలనీ గడ్డోరి గట్ట వరకు, కాలనీ నుండి తాళి పేరు ఎడమ ప్రధాన కాలువ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డుతో గ్రామస్తులు పడుతున్న తిప్పలు అంతా ఇంతా కాదు. చిన్నపాటి వర్షం వచ్చిందంటే రోడ్డంతా బురదమయం అడుగు తీసి అడుగు వేయాలంటే పాదచారులకు నరకమే కనిపిస్తుంది. ఇలాంటి ఈ రహదారిపై నడక అంటే పాదచారులు రైతులు గ్రామస్తులకు పెద్ద సవాలుగా మారుతుంది. గడ్డోరిగట్ట కాలనీ నుండి తాళి పేరు ఎడమ ప్రధాన కాలువ వరకు ఈ మార్గంలో ప్రతిరోజు చిన్న బండి రేవు గ్రామ పంచాయతీలోగల గ్రామాల నుండి ఆయా గ్రామాల ప్రజలు రైతులు వ్యవసాయ పనులు నిమిత్తం ఇతర పనులు నిమిత్తం ఈ మార్గం గుండానే అధికంగా రాకపోకలు సాగిస్తుంటారు. దీంతోపాటు వందలాది పాడి గేదెలు మేకలు పశువులు కూడా ఈ మార్గం గుండానే రోజు మేతకు వెళ్లి వస్తుంటాయి. దశాబ్దాల క్రితం వేసిన మెటల్ రోడ్లు ను అప్పటినుండి రోడ్లను అభివృద్ధి చేపట్టక రిపేర్లు చేయక ఇప్పుడు మెటల్ రోడ్డు కాస్త గ్రావెల్ మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. కొత్తగా బీటీ రోడ్లు నిర్మించండి అంటూ ప్రజాప్రతినిధులను, అధికారులను పదేపదే అడిగిన గ్రామస్తులు అలసిపోయారే గాని ప్రజా ప్రతినిధుల్లో గాని అధికారులు కానీ చలనం రాలేదు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్న అధికారులు రోడ్లు నిర్మించిన పాపాన పోలేదని గ్రామస్తులు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

బురద రోడ్డు లోనే బడి పిల్లలు రాకపోకలు

గడ్డోరిగట్ట గ్రామానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాలంటే అవతల గుంపులో ఉన్న గడ్డోరి గట్ట కాలనీకి రావాలి. ఈ రోడ్డు మట్టి రోడ్డు కావడంతో ప్రస్తుత వర్షాలకు అంతా బురద మయంగా మారింది. విద్యార్థులు బడికి వెళ్లాలంటే ఈ మార్గమే ఏకైక మార్గం. దీంతో ఆ బురద మాయమైన రోడ్డు మార్గం గుండానే రోజు పాఠశాలకు వచ్చి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆ పాఠశాలకు వచ్చే విద్యార్థుల తరచూ బురద గోతుల్లో జారి పడడం దుస్తులంతా బురదతో తడిసిపోవడం విద్యార్థులు అలాగే పాఠశాలకు వెళ్లి చదువుకునే పరిస్థితి నెలకొంది. కనీసం విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోనైనా ఈ రహదారులను నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భద్రాచలం ఎమ్మెల్యే స్వగ్రామానికి కూత వేటు దూరంలోనే ఈ రోడ్డు సమస్య

భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్వగ్రామం సూరవరం గ్రామానికి కూత వేటు దూరంలోనే ఈ గడ్డో రిగట్ట గ్రామం ఉంటుంది. మావాడు ఎమ్మెల్యేగా గెలిచాడు ఇంక మా రోడ్డుకి మహదర్శ పట్టినట్లే అని ఆశపడ్డ ఆ గ్రామస్తులకు ఎమ్మెల్యేగా గెలిచి మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్న ఆ రోడ్డుకి అతీగతీ లేకపోవడంతో గ్రామస్తుల ఆశ ఆశగానే మిగిలింది. మా ఎమ్మెల్యే మమ్ములను పట్టించుకుంటాడని మా రోడ్డు అభివృద్ధి చేస్తాడని ఎదురుచూస్తున్నా మా ఆశ నెరవేరడం లేదని గ్రామస్తులు నిరాశను వ్యక్తం చేస్తున్నారు.

పది సంవత్సరాలగా సర్వేలతోనే కాలయాపన రోడ్డు నిర్మించేది ఎప్పుడు

సర్పంచ్ మడకం జోగయ్య



గడ్డోరి గట్ట రహదారి గత అనేక సంవత్సరాలుగా బీటీ రోడ్ల నిర్మాణానికి నోచుకోవడం లేదని ప్రజా ప్రతినిధులకు అధికారులకు విజ్ఞప్తులు చేసి చేసి విసిగిపోయామని చిన్న బండి రేవు గ్రామపంచాయతీ సర్పంచ్ మడకం. జోగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. విజ్ఞప్తి చేసినప్పుడల్లా అధికారులు రావడం సర్వే చేయడం కొలతలు కొలుచుకోవడం ఇది తప్ప ఒక్క అడుగు ముందుకు పడడం లేదని ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు నిధులు కేటాయించి బీటీ రోడ్లు నిర్మించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ శాఖ ఉద్యోగ విరమణ చేసిన రాములుకు ఘన సన్మానం

గోపాలపురంలో ఆత్మీయంగా సత్కరించిన కాంగ్రెస్ నాయకులు

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 3 (మనం న్యూస్) : మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన విద్యుత్ శాఖ లైన్ ఇన్స్పెక్టర్ గడ్డికొప్పుల రాములు ఉద్యోగ విరమణ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట వీరభద్రం పాల్గొని రాములును శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్పర్సన్ పోకబత్తిని అనిత తండ్రి అయిన రాములు సేవలను గుర్తుచేసుకుంటూ పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మద్ది కిషోర్ రెడ్డి, వీరేల్లి అప్పారావు, సర్పంచ్ పాపా నాయక్, కౌన్సిలర్ చింతమల్ల రవికుమార్, మండల కాంగ్రెస్ నాయకులు బోజడ్ల రవి, గ్రామ శాఖ అధ్యక్షుడు మారుతి ఉపేందర్,



వీరంకి నాగేశ్వరరావు, బుర్ర రాజేష్, అజ్మీర విజయ, బానోత్ మంగు, టీం పొంగులేటి పీఎస్ఆర్ సోషల్ మీడియా వారియర్ ఆరెంపుల బద్రిసాయి తదితరులు పాల్గొన్నారు.